J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 30 29.12.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఆంధ్రా పార్టీలకి అభ్యర్థులు కావలెను

## అర్హతలు

- రౌడీయిజం, గూండాయిజం, దుర్మార్గాలు, దోపిడీలలో అనుభవం ఉండాలి
- బూతులు తిట్టడంలో పీహెచ్‌డీ ఉండాలి
- కూలగొట్టడాలలో అనుభవం ఉండాలి
- ఆర్థిక నేరస్తులై ఉండాలి
- జైలుకు వెళ్లొచ్చిన వారికి ప్రాధాన్యత
- అవలీలగా అబద్ధాలు చెప్పగలిగి ఉండాలి
- అవినీతి, అక్రమ సంపాదనలో అనుభవం ఉండాలి
- రాజకీయంగా అవసరమైతే... అమ్మా, నాన్న, అక్క చెల్లి, తమ్ముడు ఎవరినైనా పక్కన పెట్టేయాలి
- వ్యక్తి / చెక్క భజనలో నైపుణ్యం ఉండాలి

గమనిక : 10వేల కోట్లు లేదా అంతకుపైన ఆస్థిపరుడైతే పై నిబంధనలేవీ వర్తించవు






## అనర్హతలు

- రాజకీయాలలో అనుభవం ఉండకూడదు
- నీతి, నిజాయితీలు అన్న పదాలకి అర్థం తెలిసుండకూడదు
- సమాజంలో పెద్దమనిషి, మంచివాడు అన్న పేరు ఉండకూడదు
- జాలి, దయ, పాపభీతి, క్షమా గుణాలు అస్సలు ఉండకూడదు
- సామాజిక స్పృహ, సమాజసేవ, నైతిక విలువలు వంటి లక్షణాలు కనిపించకూడదు
- అక్రమ సంపాదనకి అడ్డు చెప్పకూడదు
- విశ్వసనీయత ఉండకూడదు, నమ్మిన వారిని, తమను భుజాన మోసిన వారిని గుర్తుంచుకోకూడదు
- సిగ్గు, లజ్జ, మానం, మర్యాద, పరువు, ప్రతిష్ట వంటి వాటిని వదిలేయాలి

గమనిక : 10వేల కోట్లు లేదా అంతకుపైన ఆస్థిపరుడైతే పై నిబంధనలేవీ వర్తించవు

ఎన్నికలు రాబోతున్నాయ్... రండయ్యా రండి, మా పార్టీ టిక్కెట్టు ఇస్తాం, మిమ్మల్ని ఎం.ఎల్.ఏని చేస్తాం, అవకాశం ఉంటే మంత్రి పదవి కూడా ఇస్తాం...! అయితే ఒక్క షరతు. మా పార్టీ టిక్కెట్టు కావాలంటే కొన్ని ప్రత్యేక అర్హతలు ఉండాలి. అలాగే కొన్ని లక్షణాలు, గుణాలు కలిగి ఉండకూడదు. అప్పుడే మీరు ఎన్నికలలో పోటీ చేయడానికి అర్హులు. ఇదీ ప్రస్తుతం ఆంధ్ర పార్టీల నోట వినిపిస్తున్న మాట. ఆ దిశగా ప్రధాన పార్టీలు తమ పార్టీ అభ్యర్థుల కోసం వేట సాగిస్తున్నాయి.

మరో రెండు రోజుల్లో 2023 ముగియబోతోంది. ఆంధ్రలోని ప్రధాన రాజకీయపార్టీలు సమరోత్సాహంతో 2024కి స్వాగతం చెప్పడానికి సమాయత్తమవుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం 2024లో రాబోయే ఎన్నికల కోసం కసరత్తు ప్రారంభించేసింది.

10 లో




## ఏపీ కాంగ్రెస్ పటిష్టత...

# ఇక రే'వంతు'?

### ఆంధ్రా డీకేగా అవతరించనున్న తెలంగాణ సీఎం!





ఆంధ్రాలో రానున్న అసెంబ్లీ ఎన్నకల నేపథ్యంలో జగన్ పార్టీలో ఉక్కపోతకు గురవుతున్న మంత్రులకి, ఎంపీలకి, ఎంఎల్ఏలకి, జిల్లాల నేతలకి, వైసీపీ శ్రేణులకి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమున్నాయనే చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో గట్టిగానే సాగుతోంది. వైసీపీలో "మీకు ఈసారికి టికెట్ అవకాశం లేదు" అనే మాట చాలామంది సిట్టింగులకి, ఆశావహులకి వినిపించే పరిస్థితులు స్పష్టంగా కనపడుతున్నాయి.

రాజకీయంగా చెలామణిలో లేకపోతే, దమ్మిడీకి కూడా పనికిరామన్న భయం ఇప్పటికే చాలామందిలో పట్టుకుంది. ఇలాంటి తరుణంలో వైసీపీ నుంచీ బయటకు వస్తే ఎందులో చేరాలి...? అన్న విషయం వైసీపీలో కాబోయే మాజీలకు పెద్ద ప్రశ్నగా తయారైందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

చూస్తూ... చూస్తూ... బీజేపీలోకి దూకలేరు. టీడీపీలో ఖాళీలు లేవు. అక్కడే ఓ పాతిక, ముప్పై మంది సీనియర్ నాయకులకు పోటీకి టిక్కెట్లు దక్కని స్థితి ఉంది. జనసేనలో ఓ ఇద్దరు, ముగ్గురికి మించి పట్టే

3 లో

# ఆరోగ్యశ్రీతో అందరికీ ఆరోగ్యం

## కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



ఆరోగ్యశ్రీ పథకంతో ఎంతోమందికి సకాలంలో వైద్యచికిత్సలందుతూ ఆరోగ్య పరిరక్షణ జరుగుతోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 23న కోవూరులోని పెళ్లకూరు కాలనీలో ఉన్న సచివాలయంలో ఆయన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయునిగా ఉంటూ, తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనసాగిస్తూ, ఎందరో పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నారన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా 5 లక్షల రూపాయల వరకు పరిమితి ఉన్న ఈ పథకాన్ని రూ. 25 లక్షల రూపాయలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని 3,257 రకాల చికిత్సలకు విస్తరించడం రోగులకు ఒక వరమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో, ఇతర రాష్ట్రాల్లో సైతం ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసి ఛైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జడ్పీటీసీ శ్రీలత, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# కొండబిట్రగుంటకు పోటెత్తిన భక్తజనం



ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈనెల 23న బోగోలు మండలం బిట్రగుంట కొండపై వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తజనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానం చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారిని గజమాలలు, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేకువన 2.30 గంటలకు సుప్రభాతసేవ అనంతరం ఉదయం 4.30 గంటల నుంచి వైకుంఠ ద్వారదర్శనం ప్రారంభమైంది. సహస్రదీపాలంకరణ, ఊంజల్‌సేవల్లో స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ఛైర్మన్ శ్రీరామాల్యాద్రి, ఇఓ రాధాకృష్ణ పర్యవేక్షించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు.

# భక్తితత్వానికి ప్రతీక.. రుక్మిణీదేవి

## ప్రముఖ అవధాని కోట రాజశేఖర్



మహాకవి పోతన రచించిన భాగవతంలో 'రుక్మిణీ కల్యాణ ఘట్టం' ఎంతో విశిష్టమైనదని, శ్రీకృష్ణ భగవానుడిని నిండు మనసుతో ఆరాధించి, ఆ భగవంతుడినే భర్తగా పొందడానికి రుక్మిణీదేవి అనుసరించిన శరణాగతి తత్వం అపూర్వమైనదని, భగవంతుని చేరుకునేందుకు నేటి భక్తులకు అలాంటి భక్తితత్వమే మార్గదర్శకమని ప్రముఖ కవి, అవధాని కోట రాజశేఖర్ అన్నారు. ఈనెల 24న మద్రాసు టీనగర్‌లోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఆంధ్రా క్లబ్‌లో నిర్వహించిన 'పోతన భాగవతం–రుక్మిణీ కల్యాణం' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ, రుక్మిణి ఆత్మ అయితే శ్రీకృష్ణ భగవానుడు పరమాత్మ అని, జీవాత్మ–పరమాత్మల కలయిక ఎంత అద్భుతమో భాగవతం ద్వారా మనకు తెలుస్తుందని అన్నారు. భక్తులను భగవంతుని దరికి చేర్చే మార్గాలన్నిటినీ భాగవతం వివరిస్తుందని, భగవత్తత్వాన్ని అత్యద్భుతంగా తెలియజేస్తూ వ్యాసమహర్షి రచించిన భాగవతాన్ని పోతన మహాకవి తెలుగులోకి అనువదించి తెలుగువారికి మహోపకారం చేశారని, అందుకే జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ 'పోతన తెలుగుల పుణ్యపేటి' అని ఒక్కమాటలో పోతన విశిష్టతను గొప్పగా కీర్తించారని ఆయన పేర్కొన్నారు. అనంతరం, వేద విజ్ఞాన వేదిక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు తదితరులు అవధాని రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. మద్రాసులోని అనేకమంది తెలుగు కవులు, ప్రముఖులు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టీడీపీతోనే మహిళలకు సాధికారత

## - 'సింహపురి స్త్రీశక్తి'లో మాజీమంత్రి సోమిరెడ్డి



తెలుగుదేశం పార్టీతోనే మహిళలకు సాధికారత సాధ్యమవుతుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న నెల్లూరు జీపీఆర్ గ్రాండ్ కళ్యాణమండపంలో 'సీబీఎన్ ఫోరమ్' ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరిగిన 'సింహపురి స్త్రీశక్తి' సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆ కుటుంబంతో పాటు రాష్ట్రం, దేశం అన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. రిజర్వేషన్‌లతోనే మహిళలకు సాధికారత సాధ్యమవుతుందనే ముందస్తు ఆలోచనలతో నాటి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీఆర్ మహిళలకు రిజర్వేషన్ ఏర్పాటు చేశారని, దాంతో మరెందరో మహిళలు ఇప్పుడు రాజకీయాల్లో రాణిస్తున్నారని అన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనే లక్ష్యంతోనే చంద్రబాబునాయుడు కూడా మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని తెలిపారు. వైకాపా పాలనలో అరాచకం రాజ్యమేలుతోందని, జగన్ ప్రవేశపెట్టిన మద్యం వల్ల ఎంతో మంది మహిళల తాళి బొట్లు తెగిపోతున్నాయని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని, మహిళలందరూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి మహిళాభ్యున్నతికి బాటలు వేయాలని కోరారు. ఫోరమ్ అధ్యక్షురాలు సుమిత, మహిళా నాయకు రాళ్ళు తాళ్ళపాక అనూరాధ, శైలజ తదితరులతో పాటు రమానారాయణ, భానుశ్రీ, పనబాక భూలక్ష్మి, మాజీమంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం వెంకట రమణారెడ్డి, బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకుడు వై.రవి, జనసేన నాయకులు బొమ్మి సురేంద్ర, అంచూరు శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 29 లోగా..

# లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

విశ్రాంత ఉద్యోగులు వారి మ్యాన్యువల్ వెరిఫికేషన్‌కు సంబంధించి లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29వ తేదీలోగా అందజేయాలని ఉదయగిరి సబ్‌ట్రెజరీ కార్యాలయం సీనియర్ అకౌంటెంట్ బి.శ్రీహరి తెలిపారు. ఉదయగిరి ఎస్టీఓ పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లో మొత్తం 674 మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, వారు తమ లైఫ్ సర్టిఫికెట్లు వీలైనంత త్వరగా ఇవ్వాలని సూచించారు.

# గీతాజయంతి వేడుకలు



నెల్లూరులోని సుజాతమ్మకాలనీలో ఉన్న శ్రీకృష్ణ ధ్యానమందిరంలో ఈనెల 23న గీతాజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గీతావైభవ్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు షేక్ నజీర్‌బాషా పాల్గొని భగవద్గీత ప్రాముఖ్యతపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా వందలాదిమంది బాలలు భగవద్గీత శ్లోకాల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులందజేశారు.

# నగరపాలక పాఠశాలలో క్విజ్



ప్రపంచ ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి–జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నెల్లూరు వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గణిత ఉపాధ్యాయులు ఇ.ధనరాజు, వివి రమణయ్య, ఉపాధ్యాయులు, ఖాజారహమతుల్లా, శారద, లక్ష్మీ ప్రసన్న, శ్రీకళ, రీనా తదితరులు పర్యవేక్షించారు.

# లింగ వివక్ష తగదు

## - డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య




లింగ వివక్ష తగదని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టప్రకారం నేరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్ హెచ్ఓ) డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. ఈనెల 23న ఆయన నెల్లూరు సంతపేటలో ఉన్న తన కార్యాలయంలో పీసీ, పీఎన్‌డీటీ స్కానింగ్ కేంద్రాల్లోని గైనకాలజిస్టులు, ఐడియాలజిస్టులతో సమావేశం పెట్టి, స్కానింగ్ కేంద్రాలను చట్టప్రకారం బాధ్యతాయుతంగా నడుపుకోవాలని, ఆ కేంద్రాలపై నిఘా ఉంచామని కూడా తెలిపారు. ఆడపిల్లలపై వివక్ష ఉండకూడదని, సమాజంలో స్త్రీ పురుషులందరూ సమానమేనని అన్నారు. తొలుత డాక్టర్ యు.సుజాత పట్నాయక్ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో అదనపు డీఎం అండ్‌హెచ్ఓ ఖాజావలి, డాక్టర్ దయాకర్, డాక్టర్ బ్రిజిత, డాక్టర్ నవీన్, డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'డైట్'లో..జాతీయ గణిత దినోత్సవం



ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ డైట్ కళాశాలలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించి ఆయన గణితశాస్త్రంలో చేసిన అపూర్వ పరిశోధనలను కొనియాడారు. అలాంటి మహనీయుల జీవితాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు, డైట్ ఉపన్యాసకులు డి.నర్సింగరావు, కె.విజయచంద్ర, యస్.బి.దాస్, యస్.శివ, సి.సోమేశ్వర్, కె.షఫీ అహ్మద్, సూపరింటెండెంట్ యస్.సురేష్‌తో పాటు ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

# దగదర్తిలో శ్రీనివాస రామానుజన్ జయంతి

దగదర్తి మండలంలోని నారాయణపురం (దక్షిణమిట్ట) పాఠశాలలో డాక్టర్ చీదరాల చెన్నయ్య ఆధ్వర్యంలో 'జాతీయ గణిత దినోత్సవం' జరిగింది. ముఖ్యఅతిథులుగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీమోహన్‌రాజు స్వచ్ఛంద సేవల గౌరవ అధ్యక్షులు ముదిగొండ వెంకటేశ్వర్లు పాల్గొని, విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. ఉపాధ్యాయురాలు టి.కల్పన తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి.. వేణుగోపాల్‌రెడ్డి శుభాకాంక్షలు

తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మన నెల్లూరీయులు, చెన్నైలో 'నిర్మల దక్షిణ్' హోటల్ అధినేత, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పోలంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. 'నిర్మల గోపాల్‌రెడ్డి'గా అందరికీ సుపరిచితులై దశాబ్దాల తరబడి హోటల్ వ్యాపార రంగంలో ప్రఖ్యాతిగడించిన వేణుగోపాల్‌రెడ్డి రేవంత్‌రెడ్డికి ఎంతోకాలం నుంచి అత్యంత సన్నిహితులు, వారి కుటుంబంతో మంచి స్నేహాభిమానం ఉన్నవారు కూడా. మాజీ కేంద్రమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత జైపాల్‌రెడ్డితోనూ, వారి సోదరులతో కూడా వేణుగోపాల్‌రెడ్డికి మంచి సన్నిహిత సంబంధాలున్నాయి. జైపాల్‌రెడ్డికి, వారి సోదరులు పద్మారెడ్డి, మనోహర్‌రెడ్డిలకు కూడా ఆయన అత్యంత సన్నిహితులు. అందులోనూ జైపాల్‌రెడ్డి తమ్ముడు పద్మారెడ్డి అల్లుడే రేవంత్‌రెడ్డి. దాదాపు 30ఏళ్ళుగా రేవంత్‌రెడ్డి కుటుంబంతో ఇంత సాన్నిహిత్యం ఉన్న నెల్లూరీయుల్లో వేణుగోపాల్‌రెడ్డి ప్రథములనే చెప్పవచ్చు. రేవంత్ ముఖ్యమంత్రి అయ్యాక ఇటీవల ఆయన హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలసి శుభాకాంక్షలు చెప్పారు. వేణుగోపాల్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు..హైకోర్టు అడ్వొకేట్ కిషోర్‌కుమార్‌రెడ్డి, మనుమరాళ్ళు మయూఖారెడ్డి, ఇవాన్షికారెడ్డిలు ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి సతీమణి శ్రీమతి గీతా రేవంత్‌రెడ్డిని..ఆమె కుమార్తె శ్రీమతి నైమిషా సత్యారెడ్డిలను కూడా కలసి ఆయన ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.





భారతీయ రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పర్యవేక్షణ మరియు రహదారి భద్రత వంటి అంశాలపై హైదరాబాదులోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో డిసెంబర్ 18 నుండి 22 వ తేదీ వరకూ జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న నెల్లూరు జిల్లా డెప్యూటీ రవాణా కమిషనర్ బి.చందర్.

# శ్రీరామచంద్రునికి వెండి కిరీటం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ శబరి శ్రీరామ క్షేత్రంలో కొలువైవున్న శ్రీరామచంద్రునికి జేఎల్ ట్రస్టు తరఫున జాలాది చంద్రశేఖర్ దంపతులు ఈనెల 26న వెండి కిరీటాన్ని బహుకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరేష్‌స్వామి ఆ కిరీటానికి ప్రత్యేకపూజలు చేసి, దాతలను ఆశీర్వదించారు.

# ఏపీ కాంగ్రెస్ పటిష్టత... ఇక రే'వంతు'?

(మొదటి పేజీ తరువాయి)

ఖాళీలేదని అంటున్నారు. కొత్తగా పార్టీ పెట్టుకున్న లక్ష్మీనారాయణ కూడా ఎంత బంగారపు పళ్లెం అయినా, ఏదో ఒక గొడుగు కిందకి వెళ్లాల్సిందే అన్నది పరిశీలకుల అభిప్రాయం. ఆయన ఏ గొడుగును ఎంచుకుంటారా..? అని కూడా చాలామంది ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇకపోతే, మిగిలింది కాంగ్రెస్సే. నిజానికి, వైసీపీలో ఇప్పుడున్న నేతలలో ముప్పాతిక శాతం మంది కాంగ్రెస్ నుంచి వైసీపీకి వలస వచ్చినవారే. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా పూర్వాశ్రమంలో కాంగ్రెస్ వాదే. అందువల్ల, వైసీపీ బాధితులంతా పొలోమని మళ్ళీ కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్నది విశ్లేషకుల అంచనా.

కాంగ్రెస్ అయితే...., రెండు బోనస్ పాయింట్స్ కూడా కనపడుతున్నాయి. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఆశీస్సులు లభిస్తాయి. వారి వారి వ్యాపారాలకు, వ్యాపకాలకు ఇబ్బంది ఉండదు. రేవంత్ స్థానంలో కేసీఆర్ ఉండి ఉంటే... జగన్‌కు, ఆయన పార్టీకి ఓ నమస్కారం పెడదామని అనుకునేవారికి హైదరాబాద్‌లో వ్యాపారాలు ఉంటే, కేసీఆర్ తాట తీస్తారేమో అని జంకు ఉండేది. ఇప్పుడా భయం లేదు.

ఎలాచూసినా వైసీపీ ఖాళీ అయిపోవాలన్నది రేవంత్ లక్ష్యం అనడానికి సందేహం అవసరం లేదు. ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రి. జగన్ కాంగ్రెస్‌ని ఏపీలో ఖాళీ చేసిన సీఎం. అందువల్ల, జగన్ పార్టీని ఖాళీ చేయించడం ద్వారా, కాంగ్రెస్ హైకమాండ్ అభిమానాన్ని రేవంత్ చూరగొనవచ్చు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్థాయిలో రేవంతుకి కూడా ఢిల్లీ పెద్దల దగ్గర పరపతి పెరగడానికి ఈ చర్య బాగా పనికొస్తుంది. రేవంత్‌కు రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఆంధ్రతో 'సంబంధ బాంధవ్యాలు' బలంగావున్నాయి. మాజీ టీడీపీ నాయకుడిగా ఆయనకి ఆంధ్రావాళ్ళతో సాన్నిహిత్యం ఎక్కువ. ఇప్పటికే ఆయన 'ఆంధ్ర శివకుమార్' పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసేశారని కూడా రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇదిగాక, వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేవారికి మరో బోనస్ వెయిటింగ్‌లో ఉంది. ఆ 'బోనస్' పేరు షర్మిల. స్వయానా జగన్ సోదరి. ఆమె ఒకసారి కాంగ్రెస్‌లో చేరితే.. కాంగ్రెస్ రైలుకు ఇప్పుడు ఉన్న బొగ్గు ఇంజను తీసేసి, డీజిల్ ఇంజిన్ తగిలించినట్టేనని పలువురు సీనియర్‌లతో పాటు నేటితరం కాంగ్రెస్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. షర్మిల రాక జీవచ్ఛవంలా వున్న కాంగ్రెస్‌కి కొంత ప్రాణం పోస్తుందన్నది వారి అభిప్రాయం. తమ పార్టీని, తమని అసలు గుర్తించని జనం కనీసం తమవైపు చూడడానికైనా షర్మిల చేరిక ఉపయోగపడుతుందని ఒక కాంగ్రెస్ మాజీ మంత్రి చెప్పడం విశేషం.

అధిక శాతం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీపై అలిగి కాంగ్రెస్‌లో చేరడంవల్ల, జగన్ ఓటు బ్యాంకుకు కొంతమేరకు గండిపడే అవకాశాలు కూడా లేకపోలేదు. అంతే కాకుండా టీడీపీ, జనసేనతో కాంగ్రెస్‌కు 'వరుస'కుదిరే అవకాశాలు కూడా ఉన్నాయన్న వార్తలు రాజకీయవర్గాల్లో చక్కర్లుకొడుతున్నాయి. కాంగ్రెస్‌కు ఎం.పీ సీట్లు కావాలి, టీడీపీ, జనసేనలకి అసెంబ్లీ సీట్లు లక్ష్యం. కనుక టీడీపీ కూటమితో కాంగ్రెస్ కలయికకు పెద్దగా అడ్డంకులు ఉండవని అంటున్నారు.

కర్ణాటక డెప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇద్దరూ కలిసి ఆంధ్రాలో కథ నడిపించడం ఖాయం అంటున్నారు విశ్లేషకులు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్ అందరికీ ఉమ్మడి రాజకీయ శత్రువు జగనే కాబట్టి, ఆయనని లక్ష్యం చేసుకుని వీరంతా పావులు కదపడం ఖాయం అన్నది వారి అభిప్రాయం!







# ఆశ-నిరాశల ఊగిసలాటలో.. 2024

కొత్త సంవత్సరం వస్తున్నదంటే ఎవరికైనా సంతోషమే. ఆ సంబరం అంతా ఇంతా కాదు. వసంతం వస్తే కోయిలలు కుహుకుహు రాగాలు తీసినట్లు కవులు స్వాగతగీతాలు పాడుతుంటారు. కానీ, గత కొద్ది సంవత్సరాలుగా ఆ ఆనందం మటుమాయమైపోయింది. ముఖ్యంగా కరోనా రాకాసి మానవాళిని నంజుకుతినడం ప్రారంభించినప్పటినుంచి కొత్త సంవత్సరం వస్తున్నదంటే శుభాకాంక్షలు మరచిపోయి భయపడే దుస్థితి వచ్చేసింది. మూడేళ్ల కిందట విరుచుకుపడిన కరోనా 2020 నుంచి ఎందరి ప్రాణాలనో తీసింది. కోట్లాది కేసులతో ప్రపంచమే రోగగ్రస్తమైంది. ఈ మాయదారి వ్యాధి తగ్గిపోయిందిలే అనుకుంటున్న తరుణంలో ఇప్పుడే మళ్లీ కొత్త రూపంతో వచ్చి ప్రజలను వణికిస్తోంది. గత ఏడాది సరిగ్గా డిసెంబరులో బిఎఫ్-17 రకం కోవిడ్ మరో కొత్త వేరియంట్ జనాన్ని భయపెట్టింది. ఇప్పుడు మళ్ళీ జెఎన్-1 రకం వైరస్‌తో బెంబేలెత్తిస్తోంది. డిసెంబరు నెల వస్తే చాలు చలి వాతావరణం వల్ల కాబోలు కరోనా విజృంభిస్తోంది. కొత్త సంవత్సరం రెక్కలు విప్పుకునేసరికి కరోనా కొత్త కోరలతో వీరంగం చేస్తోంది. దేశంలో ఈ డిసెంబర్ 26 నాటికి కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 4093కు చేరుకుందని, అవికాక కరోనా జెఎన్-1 వేరియంట్ కేసులు 109 దాకా వచ్చాయని గణాంకాలు చెప్తున్నాయి. అత్యధికంగా గుజరాత్‌లో 36, కర్నాటకలో 34 కేసులు వచ్చాయి. ఇక రానున్న కొత్త సంవత్సరం కరోనా మరెంతగా విజృంభిస్తుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

ఈ ఏడాది మనదేశం చేపట్టిన చంద్రయాన్ విజయవంతం కావడం, ఎవరూ సాహసించని విధంగా ఆగస్టు 23న చంద్రుని దక్షిణభాగంలో భారత వ్యోమనౌక అడుగిడడం భారత అంతరిక్ష ప్రయోగాల్లోనే ఒక అద్భుతం. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరిన్ని అపూర్వమైన పరిశోధనలకు ఉపక్రమిస్తోంది. కొత్తసంవత్సరం జనవరి 1న ఎక్స్‌పో శాట్ ప్రయోగానికి సిద్ధం అవుతుండడం హర్షదాయకం. జంట కృష్ణబిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల రహస్యాలను కనుగొనేందుకు ఇస్రో సంసిద్ధమవుతోంది కూడా. మరోవైపు ఇటీవల ప్రధాని మోడీ సారథ్యంలో జీ-20 సదస్సు విజయవంతం కావడం,

లాయర్
డిసెంబర్ 29, 2023

అగ్రదేశం అమెరికాతో సహా అనేక దేశాల ప్రతినిధులు ఢిల్లీకి రావడం, న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదముద్ర వేయడం వంటివన్నీ ఈ ఏడాది జరిగిన చరిత్రాత్మక విషయాలే. ఇవన్నీ భారత్‌కు మంచి కీర్తిప్రతిష్టలను తెచ్చిపెట్టడం సంతోషకరమే అయినా, రానున్న విపత్తులు ఎలా ఉంటాయో ఊహించుకుంటేనో అందరిలో ఆందోళన కలుగుతోంది. అందులోనూ ప్రపంచమంతా అశాంతితో ఉంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఈ ఏడాదంతా కొనసాగుతూనే ఉంటే, ఇంకోవైపు పాలస్తీనాపై ఇజ్రాయెల్ దండయాత్ర అనేక దేశాల ప్రజలను కంటికి నిద్ర లేకుండా చేస్తోంది. యుద్ధాలు మారణహోమాలతో పలుదేశాలు భీతావహంగా మారుతున్నాయి. ప్రకృతిని సంరక్షించుకోలేకపోవడంతో వాతావరణ పరంగా కూడా ప్రమాద సంకేతాలు వస్తున్నాయి. భూమండలమే వేడెక్కిపోయి రుతువులు మారిపోయాయి. అకాల వర్షాలు-తుఫాన్లు, అనావృష్టి-కరువులు పెరిగిపోతున్నాయి. హిమానీ నదాలు కరిగిపోతున్నాయి. అవి వరదలుగా పరిణమిస్తున్నాయి. ఇటీవలే మిచౌంగ్ తుఫాన్ ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలను వణికించింది. మరోవైపు మానవ తప్పిదాలుగా అడవుల నరికివేత, ప్రకృతి వనరులను దోపిడీ చేయడం, గనులను తొలిచివేయడం వంటివి ఎక్కువైపోయి పర్యావరణం పట్టుతప్పుతోంది. ఎక్కడ చూసినా కాలుష్యమే. చివరికి నదులు, సముద్రాలు కూడా కాలుష్యపు కాటుకు గురవుతున్నాయి. పచ్చదనం కరువైపోతోంది. ఇవన్నీ చివరికి ఎలాంటి ముప్పును తెస్తాయో తెలియదు. ఈ నేపథ్యంలో మనదేశం మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉంది. కరోనా వ్యాధి ప్రబలకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. తొలిసారి కరోనా విజృంభణ సమయంలో తీసుకున్న జాగ్రత్తలకు మళ్ళీ పదునుపెట్టాలి. మాస్కులు ధరించడం, ప్రజలను చైతన్యవంతం చేయడం వంటివి ఇప్పుడు కూడా మరింత అవసరం. అదేవిధంగా, తుఫాన్లు వరదల వంటివాటిని ముందస్తుగానే గ్రహించి ఎలాంటి ప్రాణనష్టాలు, ఆస్తినష్టాలు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి కూడా సిద్ధంగా ఉండాలి.

ఏదేమైనా, ఆశల పల్లకీ తెస్తుందనుకున్న కొత్త ఏడాది-2024 ఆశనిరాశల ఊగిసలాటలో ఉంది. అయినా..అన్ని సమస్యలను అధిగమించాలని, కొత్త సంవత్సరం అందరికీ ఆనందమయంగానే ఉండాలని, ఏ బాధలూ వ్యాధులూ బాధించకుండా సకల మానవాళి అంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ..అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!...

# తప్పుదారి పడుతున్న ఉద్యమస్ఫూర్తి

ఉద్యమాలు, ఆందోళనలు, నిరసనలు, దీక్షలు వగైరాలు నిత్యం దేశమంతటా జరుగుతున్నవే. అన్ని ప్రాంతాల్లో అనేక రకాల సమస్యల మీద గళమెత్తుతూనో, ధ్వజమెత్తుతోనో ఉద్యమాలు జరుగుతూనే ఉంటాయి. హక్కులు సాధించుకునేందుకు, సమస్యలు పరిష్కరించునేందుకు అవసరమైతే వీధుల్లోకొచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహించడం లేదా ఆందోళన చేయడం అన్నది అందరి హక్కు. ఇందులో కాదనాల్సింది ఏమీలేదు. ఉద్యమాలను కొంతదూరం నాయకులు నడిపిస్తే, ఇంకొంత దూరాన్ని ఉద్యమాలే నడిపిస్తుంటాయని కూడా ఉద్యమకారులు చెప్తుంటారు. ఒకదశలో ఆ ఉద్యమాలు మన చేతుల్లో ఉండవు. ఏ నిరసన ప్రదర్శనో చేసేటప్పుడు ఏ సంఘవ్యతిరేకశక్తులో దూరి అవతలివాళ్ళమీద రాళ్లు వేస్తేనో లేదా లేనిపోని మాటలు అంటేనో అవి ఘర్షణలకు దారితీస్తుంటాయి. అనుకున్నదొకటైతే అయ్యింది మరొకటి అన్న సామెతగా అవుతుంటుంది పరిస్థితి. ఆందోళనలన్నవి వాటి నిర్వాహకుల నియంత్రణలో లేకుంటే ఒక్కోసారి ప్రమాదం కూడా. ఇప్పుడు ఉసిక్కుమంటే ఉద్యమం అంటున్న ఛోటానాయకులు లెక్కలేనంతమంది. వ్యక్తిగత స్వార్థాలకు, రాజకీయ ప్రయోజనాలకు కూడా కొందరు ఉద్యమాలకు దిగుతుంటారు. ఇలాంటి సందర్భాల్లోనే ఉద్యమస్ఫూర్తి తప్పుదారి పడుతోంటుంది. అందుకే, ఏ ఆందోళనకు ఎంతవరకు దిగవచ్చు, ఎంతవరకు మద్దతు ఇవ్వవచ్చు అనే ఆలోచన లేకపోతే తంటాలు పడక తప్పదు. కొందరు ఏదో సమ్మె అంటారు. మధ్యలో ఎవరో వచ్చి, రోడ్లమీద తిరిగే వాహనాల మీద రాళ్లేస్తారు. దీంతో ఆ సమ్మెలో ఉన్న అమాయకులు కూడా వారితోపాటు ఆందోళనకారులుగా ముద్రపడతారు. ఇంకొందరు ఉద్యమాల ముసుగులో ఏకంగా బస్సుల్నో, రైళ్లనో తగలబెట్టేందుకు కూడా సిద్ధపడుతుంటారు. అలాంటి దుండగులపట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. తెలిసో తెలియకో వాళ్లతో కలసి తిరిగితే ప్రమాదం. ప్రజల కోసం పోరాడేవాళ్లు ప్రజల ఆస్తులను, లేదా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలనుకోవడం ఏ రకం ఉద్యమమో అర్థం కాదు. కొంతమంది ఆందోళనకారులకు అదొక ఉత్సాహం కావచ్చు కానీ, ఎంతొకవేళ పెద్ద ఉద్యమమే అయినా విధ్వంసాలకు దిగడం ఏమిటి?..హక్కుల కోసం పోరాటాలు చేయడాన్ని కాదనే హక్కు ఎవరికీ లేదు. అయితే బాధ్యతలు కూడా ఉంటాయని గుర్తించాలి కదా!.. ఏదేమైనా, ఎంతటి జటిలమైన సమస్యకైనా పరిష్కారానికి మార్గాలుంటాయి. శాంతియుతంగా చర్చించుకుంటే దేనికైనా పరిష్కారం దొరుకుతుంది. ఆ దారులన్నీ వదిలేసి తప్పుదారి పట్టడం వల్ల నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనమూ




ఉండదు. కొందరు ఏకంగా రోడ్లమీద బైఠాయించి వాహనాలను ఆపేస్తారు. ఆ వాహనాల్లో తల్లికో తండ్రికో బాగలేక గబగబా ఆసుపత్రికి వెళ్లాలనుకునేవారో, లేదా పరీక్షలకు వెళ్లే విద్యార్థులో ఉంటారు. వాళ్ల పరిస్థితేమిటి?..ఉద్యమాల పేరుతో అల్లర్లకు లేదా అరాచకాలకు పాల్పడే అల్లరిమూకల ఆగడాలకు ఇబ్బందులు పడే సామాన్యులు కొల్లలు. ఆ ఉద్యమాలకి లేదా ఆందోళనలకి ఎలాంటి సంబంధం లేని అమాయక ప్రజలను బాధితులుగా చేయడం సమంజసమా?.. ఏమిటో కాలమహిమ, ప్రతి చిన్నవిషయానికీ అలిగి రోడ్డెక్కడమే ఇప్పుడు ఉద్యమంగా లెక్కలోకి వస్తోంది. దేశస్వాతంత్ర్యం కోసం ఎందరో పోరాటవీరులు ఉద్యమబాట పట్టి దేశభక్తితో దేశమాత స్వేచ్ఛకోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారు. అసామాన్యమైనవారి త్యాగాలకు అంతేలేదు. దేశం కోసం ఉద్యమించారు..స్వాతంత్ర్యం సాధించారు. అందుకే అది స్వాతంత్ర్యోద్యమం అయ్యింది. బాపూజీ చేసిన ఉప్పు సత్యాగ్రహం, నిరసన దీక్షలకు కోట్లాదిమంది ప్రజలు అండగా నిలిచారు. మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు వాళ్ల తేజస్సు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి మరీ అనుకున్నది సాధించారు. వ్యక్తి ఒకరే అయినా, దేశం అబ్బురపడే మహాశక్తిగా నిలిచాడు. ఆయనే ఒక ఉద్యమమై జనం కోసం పోరాడారు. అలాంటి అమృతమయులు ఈ కాలంలో ఎక్కడున్నారు?.. నెల్లూరుజిల్లా దూబగుంటలో రగులుకున్న సారా వ్యతిరేక ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా భగ్గుమంది. సారా రాకాసికి కాపురాలను బలిచేయడం జరుగుతున్న నేపథ్యంలో సారా వద్దంటూ మహిళాలోకం బెబ్బులివలె గర్జించడం అందరికీ తెలిసిందే కదా!.. ఎన్నో కేసులు, లాఠీచార్జీలు..అన్నిటినీ భరాయించారు. ఉద్యమం ద్వారా అనుకున్న మంచి లక్ష్యాన్ని సాధించేందుకు ఎంతగానో కృషిచేశారు. జనం కోసం చేసే ఉద్యమాలంటే అవీ. ఇప్పుడు చేసే అనేకరకాల ఉద్యమాల్లో ఆనాటి స్ఫూర్తి కనుమరుగైపోయింది. ఏ ఉద్యమం ఎందుకు చేస్తున్నారో అర్థంకాని అయోమయ పరిస్థితి. కొందరు చోటానాయకులు చీటికీమాటికీ ఉద్యమాల పేరుతో రోడ్లమీదికి వస్తారు. ఉదయం 10గంటలకు రోడ్లమీదికి అమాయక జనాన్ని తోలుకు రావడం, రెండుమూడు వీధుల్లో నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేయడం, పత్రికలోళ్ళొచ్చి ఫోటోలు తీసుకున్నాక, ఇక తమపని అయిపోయిందని వెళ్లిపోవడం..ఇదీ ఇప్పటి ఉద్యమాల తంతు. కొంతమంది దీక్షలంటారు కానీ, వాటిలో కార్యదీక్ష ఏమాత్రం ఉండదు. అన్నీ ఉత్తుత్తి దీక్షలే. అలా వ్యక్తిగత ప్రచారంకోసం చేసే ఉద్యమాలు, స్వప్రయోజనాలకుచేసే ఉద్యమాలు ఎన్నిచేసినా ఏం ప్రయోజనం?.. ఉద్యమాలు పక్కదారి పట్టకూడదు.

- రాజశ్రీ

# కాలువ కనిపిస్తే చాలు.. కబ్జాలేనా?

కాలువలు కనిపిస్తే చాలు, కబ్జాలు చేసేస్తున్నారు. ముఖ్యంగా నెల్లూరు నగరంలో ఈ కబ్జాలు విపరీతం అవుతున్నాయి. ఎక్కడ ఖాళీస్థలం కనిపించినా, పంటకాలువలు.. పిల్లకాలువలు కనిపించినా సరే, ఆక్రమించేసుకుంటున్నారు. మురుగునీరు పోవాల్సిన డ్రైనేజీ కాలువల మీద కూడా పాగా వేస్తున్నారు. నెల్లూరు చెరువు నుంచి పంటపొలాలకు వెళ్లే కాలువలన్నీ ఈ ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. నగరంలోని మాగుంట లేఅవుట్, అన్నమయ్య సర్కిల్, ఇస్కాన్‌సిటీ ఇలా పలుచోట్ల అక్రమార్కులు కాలువలను ఆక్రమించి నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారు. పాత మునిసిపల్ కార్యాలయం, నెల్లూరు చెరువు ప్రాంతం, మన్సూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇలా అడ్డదిడ్డంగా కాలువలను ఆక్రమించేయడంతో గతంలో వానలొచ్చినప్పుడు రోడ్డే కాలువగా మారిపోయి, చివరికి పడవల మీద వెళ్ళాల్సి వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. మొన్నటి మిచౌంగ్ తుఫాన్‌లో నగరంలోని రోడ్లు కాలువల్లా తయారయ్యాయి. అండర్‌బ్రిడ్జిలు పూర్తిగా జలమయం అయ్యాయి. మాగుంట లేఅవుట్‌లో నీళ్లు ఎటూ వెళ్ళే దారి లేక ఇళ్ళల్లోకి, కార్యాలయాల్లోకి కూడా ఆ మురుగునీళ్ళన్నీ ప్రవాహంగా వచ్చేశాయి. జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా మేల్కొని నెల్లూరు నగరంలో తొలినుంచీ ఎక్కడెక్కడ కాలువలున్నాయో, ఏ మేరకు అవి ఆక్రమణలకు గురయ్యాయో మాస్టర్‌ప్లాన్‌ను సరిచూసి, పాతరోజుల్లోని మ్యాప్‌లు, రికార్డులు పరిశీలిస్తే ఈ ఆక్రమణల బండారం బయటపడుతుంది.

ఎస్.వీరభద్రం, నెల్లూరు

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# కరోనా.. పొంచివుంది జాగ్రత్త!

ఇక రాదులే..తగ్గిపోయిందిలే అనుకుంటున్న కరోనా మళ్లీ కోరలు చాస్తోంది. కొత్త వేరియంట్ జెఎన్-1 కేసులు దేశంలో ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. రోజురోజుకు కేసుల సంఖ్య పెరుగుతుండడం చూస్తుంటే, ఇది మరింతగా విస్తరించే ప్రమాదం ఉంది. దీనివల్ల ప్రాణాపాయం లేదంటున్నారు కానీ, అనారోగ్యంతో అవస్తలు పడాల్సివస్తుంది. ఇప్పటికే కరోనా సోకి ఆసుపత్రులో చికిత్సలు పొందివచ్చాక కూడా ఇంకా ఎంతోమంది అనారోగ్యాలతో అవస్తలు పడుతున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కరోనా రాకుండా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవాలి. వైరస్ సోకకుండా మాస్కులు పెట్టుకోవడం అవసరం. గుంపుల్లో తిరగకుండా దూరం పాటిస్తూ, వ్యక్తిగత శుభ్రతతో ఉంటూ ఎవరికి వారు జాగ్రత్తల్లో ఉండడం శ్రేయస్కరం.

ఆర్.కె రామారావు, గూడూరు

# తలసేమియా చిన్నారులకు పునర్జన్మనిచ్చిన రెడ్‌క్రాస్

## జిల్లా ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి




ప్రాణాంతకమైన తలసేమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు.. ఎంతో ఖరీదైన చికిత్సలు చేయించడం ద్వారా నెల్లూరు రెడ్‌క్రాస్ పలువురు చిన్నారులకు పునర్జన్మ ప్రసాదించిందని రెడ్‌క్రాస్ ఛైర్మెన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తలసేమియా వ్యాధితో బాధలు పడుతున్న ఆరుగురు చిన్నారులకు ఆ వ్యాధి నుంచి విముక్తి కలిగించడానికి దాతల సహకారంతో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు చేయించామన్నారు. తలసేమియా జన్యు పరంగా వచ్చే వ్యాధి అని, అది దురదృష్టవ శాత్తూ కొంతమంది చిన్నారుల్లో పుట్టుక తోనే ప్రారంభం అవుతుందని, ప్రతినెలా రక్తం మార్పిడి చేయడమొక్కటే దీనికి పరిష్కార మార్గమని అన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్‌లో గత నాలుగు సంవత్సరాలుగా 110మంది తలసేమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు ప్రతినెల ఉచితంగా రక్త మార్పిడి చేయడం.. అందుకు అవసరమయ్యే మందులు ఉచితంగా అందజేసి, వారికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామని, దీనిని పూర్తిగా నయంచేయడానికి బోన్‌మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స ఒకటే మార్గమని, అయితే అందుకు లక్షలాది రూపాయలు ఖర్చవుతాయని వివరించారు. దాతలు శ్రేయోభిలాషుల సహకారంతో ఆరుగురు తలసేమియా చిన్నారులకు సుమారు రెండు కోట్ల రూపాయలు ఖర్చయ్యే బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను విజయవంతంగా పూర్తి చేయించి.. వారికి పునర్జన్మ ఇవ్వడం జరిగిందని, మరో ఇద్దరు చిన్నారులు శస్త్ర చికిత్స పూర్తిచేసుకుని క్వారంటైన్‌లో ఉన్నారని వివరించారు, ఈ సందర్భంగా, ఈ కార్యక్రమాన్ని మొదటి నుండి నడిపించిన తలసేమియా కన్వీనర్ డాక్టర్ సీత, కో-కన్వీనర్ షేక్ పర్వీన్, అడ్వైజర్ డాక్టర్ హరితకు ఆయనతో పాటు, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.



పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర వస్తు సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు-2023పై ఇటీవల జరిగిన చర్చల్లో పాల్గొన్న అనంతరం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను గౌరవపూర్వకంగా కలసిన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, అయోధ్య రామిరెడ్డి, లోక్‌సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, శ్రీకృష్ణదేవరాయలు.

# వాడవాడలా క్రిస్టమస్ సంబరాలు



జిల్లాలో డిసెంబరు 25న క్రిస్టమస్ పర్వదినం వేడుకలు ఘనంగా జరిగాయి. ఒకరికొకరు హ్యాపీ క్రిస్టమస్ అంటూ ఆనందోత్సాహాలతో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వాడవాడలా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కరుణామూర్తి, శాంతిదూత ఏసుక్రీస్తును భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తూ చర్చి పెద్దలు వాక్యోపదేశాలు చేశారు. నిరుపమాన త్యాగానికి, దయ, కరుణ, ప్రేమాభిమానాలకు ఏసుక్రీస్తు ప్రతీక అని పాస్టర్లు ఉద్బోధించారు. క్యాండిల్స్ వెలిగించి ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ క్రైస్తవ సోదరులు లోకరక్షకుడిని వేడుకున్నారు. నెల్లూరు నగరంలోని అనేక చర్చిల్లోనూ క్రిస్టమస్ వేడుకలు అంబరాన్నంటే సంబరంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలను విద్యుద్దీపాలం కరణలతో శోభాయమానం చేశారు. భక్తిపాటలతో, సాంస్కృతిక వేడుకలతో చర్చిల్లో కోలాహలం నిండింది. అనేకమంది క్రైస్తవ సోదరులు సేవాభావంతో అన్నదానాలు, వస్త్రదానాలు చేశారు.

# శ్రీసిటీలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 23న శ్రీసిటీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం హరినామ స్మరణతో మార్మోగింది. ధనుర్మాసంలో భాగంగా ప్రత్యేక పూజల అనంతరం శనివారం వేకువజామున ఆలయంలో ఏర్పాటు చేసిన 'ఉత్తర ద్వార దర్శనం'కు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దంపతులు ఆలయ పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరికథా గానం, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పుత్తూరుకు చెందిన ప్రఖ్యాత పండిత కవి ఒంటి రవి ఆధ్వర్యంలో కథలు, పద్యాలు, సంగీతం, నృత్యం, తత్వశాస్త్ర మేళవింపుగా అపర విష్ణుభక్తుడు అంబరీష చరిత్రపై సాగిన హరికథాగానం అలరించింది. దీనికి వాద్య కళాకారులు టి.సుబ్రమణ్యం (తబలా), రమణకుమార్ (కీబోర్డ్)లు వాద్య సహకారం అందించారు. సాయంత్రం శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, మల్లవారిపాలెం వెస్ట్ గ్రామాలకు చెందిన శ్రీ తిరువెంకట రామానుజ భక్త సమాజం సభ్యుల కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి పి.శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




డా॥ సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై 18 ఏళ్ళు గడుస్తాయి.

మరపురాని మీ మధుర జ్ఞాపకాలతో...

భార్య
డాక్టర్ చిట్టమూరు భారతి
కుమారుడు
చిట్టమూరు లోహిత్
కుమార్తె
ప్రణీత అరవింద్
చెల్లెలు
నిర్మల
బావ
డా॥ సి.యం.కె.రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

# నెల్లూరు కబుర్లు

## ద్వారకాకు రూప్ శుభాకాంక్షలు



నుడా (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా రెండవ సారి నియమితులైన ముక్కాల ద్వారకానాథ్‌ను ఇటీవల నెల్లూరు నగర డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు నెల్లూరు మూలాస్థానేశ్వరస్వామి దేవాలయం ఛైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు కార్పొరేటర్లు ఇంతియాజ్, గోగుల నాగరాజు, మైనారిటీ నాయకులు హాజీ, నిశ్చల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'వేద విద్యానిధి' పురస్కారాలు



నెల్లూరు రాయాజీవీధిలోని శ్రీ శివరామకృష్ణ భజనమదిరంలో ఈనెల 24న వేదపండితులకు వేద విద్యానిధి పురస్కారాలను అందజేశారు. రుగ్వేదంలో కంచి జ్యోతి స్వరూప్‌శర్మ, యజుర్వేదంలో శ్రీ శృంగేరి భారతీ తీర్థ స్వామి, ఇసుకపాళెం వేదపాఠశాల అధ్యాపకులు దేవరకొండ నాగ రాజుశర్మ, సామవేదంలో మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన పప్పు శ్రీకాంత్‌శర్మ, అధర్వణ వేదంలో ఒంగోలుకు చెందిన పప్పు నవీన్‌శర్మలకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చతుర్వేదుల శ్రీరామమూర్తి, రామాయణం మహేష్‌స్వామి, సమయానంద స్వామి, శిరోమణి శర్మ, గాజులపల్లి శివరామయ్య, చతుర్వేదుల రామ చంద్రరావు, మామిళ్ళపల్లి నాగరాజశర్మలు పాల్గొని వారికి వేద విద్యానిధి పురస్కారాలను అందజేసి సత్కరించారు. కామధేను పురస్కారాల కన్వీనర్ మైపాడు రాజా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## కళకళలాడుతున్న.. 'కాంచీపురం పెరుమాళ్ శిల్క్స్'





'పెళ్లి పెద్ద పెరుమాళ్, నవ్యాంధ్రలో అతిపెద్ద వెడ్డింగ్ మాల్'.. అంటూ నెల్లూరు వస్త్రప్రపంచంలో ఇటీవలే అడుగుపెట్టిన పెరుమాళ్ వెడ్డింగ్ మాల్ కొద్దిరోజుల్లోనే ప్రజల ఆదరణ పొందుతూ తనదైన ప్రత్యేకతతో రాణిస్తోంది. నెల్లూరు నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న అన్నమయ్య సర్కిల్ వద్ద కొద్దిరోజుల క్రితం ప్రారంభమైన 'కాంచీపురం పెరుమాళ్ శిల్క్స్' షోరూం ప్రారంభించిన రోజు నుంచి నిత్యం వినియోగదారులతో కిటకిటలాడుతోంది. 'సరసమైన ధరలు, నాణ్యత, విశ్వసనీయత' అనే నినాదంతో, ఎన్నెన్నో రకాల పట్టు చీరలు, ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా మంచి నాణ్యత కలిగిన వస్త్రాలతో, సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే ధరలతో ప్రజలను ఈ వెడ్డింగ్ మాల్ బాగా ఆకట్టుకుంటోంది. విశాఖ శ్రీ శారద పీఠాధిపతులు, జగద్గురు శంకరాచార్య సాంప్రదాయ శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామివారి మంగళాశీస్సులతో ఈ షోరూం ప్రారంభం కావడం విశేషం. ఎంతో వైభవంగా జరిగిన ఈ ప్రారంభోత్సవంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌తో పాటు అనేకమంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెడ్డింగ్ మాల్ నిర్వాహకులు బయ్యా శ్రీనివాసులు, వెంకటరవికుమార్, రాణాప్రతాప్‌లు మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అతిపెద్ద వెడ్డింగ్‌మాల్‌ను నెల్లూరులో ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని, అన్నిరకాల వెడ్డింగ్ కలెక్షన్స్‌ను అందరికీ అందుబాటులో ఉంచామని, మహిళలకు, పురుషులకే కాక చిన్నారులకు కూడా రకరకాల వస్త్రాలను, సరసమైన ధరలకే అందిస్తున్నామని తెలిపారు.

## ఆందోళన కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు

తమ సమస్యల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన కొనసాగుతూనే ఉంది. ఈనెల 26న జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు నెల్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున జరిగిన ధర్నాందోళనలో పాల్గొన్నారు. పళ్ళాలు, గరిటెలతో పెద్దగా శబ్దాలు చేస్తూ..ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలంటూ నినాదాలు చేశారు. గత 15రోజులుగా సమ్మె చేస్తున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇకనైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. సీఐటీయు నాయకుడు నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహానా బేగం, అంగన్‌వాడీ నాయకురాళ్ళు కామాక్షమ్మ, రజని, సంపూర్ణమ్మ, సీఐటీయు రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యోగా గురువులకు పురస్కారాలు




బెంగుళూరులోని గ్లోబల్ మెగా సమ్మిట్ పేరుతో ఈనెల 24న జరిగిన అంతర్జాతీయ సదస్సులో నెల్లూరుకు చెందిన యోగా గురువులు ప్రసన్నకుమార్, పద్మావతిలు 'యోగా సేవా పురస్కారాలు' అందుకున్నారు. నిర్వాహకులు దేవరాజ్, కోఆర్డినేటర్ బోలేనాథ్, శివలాల్, యోగా మాస్టర్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శబరి శ్రీరామక్షేత్రంలో హనుమత్ వ్రతం



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ శబరి శ్రీరామక్షేత్రంలో ఈనెల 24న హనుమత్ వ్రతం అద్వితీయంగా జరిగింది. మార్గశిర శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి, లక్ష నాగవల్లీ దళార్చన (తమలపాకులతో అర్చన)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం సత్యనరేష్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయ స్వామికి విశేషపూజలు, అభిషేకాలు చేశారు. తొలుత ఆలయంలోని హనుమత్ సమేత సీతాలక్ష్మణ సహిత శ్రీ కోదండ రామ స్వామివారికి శోభాయమానంగా అలంకరణలు చేసి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు రాసిన శ్రీరామకోటి పుస్తకాలను మంగళ వాద్యాలు, శ్రీరామ నామోచ్ఛరణల మధ్య ఊరేగింపుగా తీసుకురాగా, అర్చకులు ఆ పుస్తకాలకు పూజలు చేసి ఆలయం చెంతన ఉన్న శ్రీరామ స్థూపంలో నిక్షిప్తం చేశారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులందరికీ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



## 'తంగిరాల మహాభారతం' 87వ భాగం

శ్రీకృష్ణుడు, ధృష్టద్యుమ్నుడు పాండవుల వద్ద సెలవు తీసుకొని తిరిగి వెళ్ళిపోగానే పాండవులు ద్వైత వనం చేరుకొని, దాని అందాలు చూసి మైమరిచిపోయారు. కొన్ని రోజులకు మార్కండేయ మహాముని, బకదాల్భ్య ముని పాండవులను సందర్శించి వారిని అమోఘ ఆశీర్వచనాలతో అనుగ్రహిస్తారు.

అన్నీ మరిచిపోయి హాయిగా గడుపుతున్న పాండవులను చూసి ద్రౌపది తనలో ఉన్న అవమాన భారాన్ని మోయలేక ధర్మరాజుతో ఇక కౌరవుల మీదకు దండెత్తే సమయం ఆసన్నమైందని, అక్కడ దుర్యోధనాదులు సుఖాలు అనుభవిస్తుంటే రాజ్యం పోగొట్టుకొని ఇలా అరణ్యవాసం గడపడం న్యాయం కాదని, వెంటనే వారి మీదకు దండెత్తి వారిని నిర్జించవలెనని ప్రార్థిస్తుంది.

కానీ, ధర్మరాజు సహనం పాటించమని హితబోధ చేసినప్పుడు ద్రౌపదికి మనశ్శాంతి కలగలేదు.




భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## రంగనాథాలయంలో భారీగా ప్రసాదాల పంపిణీ

- జై శ్రీరామ్ హనుమాన్ భక్తబృందం వితరణ



ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో జై శ్రీరామ్ హనుమాన్ భక్తబృందం వారు భారీగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కొండ్రెడ్డి భరత్‌కుమార్‌ల చేతుల మీదుగా భక్తులకు వాటిని అందజేశారు. ఈసారి ప్రత్యేకంగా భక్తుల కోసం చీరాల నుంచి పెద్దసంఖ్యలో లడ్డూలను, వెయ్యి కిలోల పులిహోరా ప్రసాదాలను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తబృందం సభ్యులు పాదర్తి బాలాజీ, సాయిబాబా, శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, అభిలాష్, సాయిరామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె బాటలో మునిసిపల్ కార్మికులు

పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, ఏళ్ళతరబడి పారిశుద్ధ్య కార్మికులుగానే ఉన్న తమను పర్మనెంట్ చేయాలని తదితర డిమాండ్లతో మునిసిపల్ కార్మికులు ఈనెల 26న సమ్మె బాట పట్టారు. సీపీఎం, సిఐటీయు నాయకుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించేవరకు నిరవధిక సమ్మెచేస్తామని నాయకులు కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కిన్నెర కుమార్, మూలం ప్రసాద్, మస్తాన్‌బీ తదితరులు స్పష్టం చేశారు. తొలుత నగరంలోని గాంధీబొమ్మ వద్ద నుంచి ఆర్టీసీ కూడలి వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనలో పెద్దసంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# 'వికసిత్ భారత్'తో దేశానికి మరింత వికాసం

## - ప్రఖ్యాత శాస్త్రవేత్త డా. సతీష్‌రెడ్డి



భారతదేశాన్ని శాస్త్ర, సాంకేతిక, విద్యా రంగాలలో మరింత ఉన్నత స్థానానికి తీసుకుని వచ్చి 2047నాటికి దేశాన్ని ప్రపంచంలో గొప్ప అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' కార్యక్రమాన్ని చేపట్టిందని కేంద్ర రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త డా.సతీష్ రెడ్డి చెప్పారు. ఆ లక్ష్యాలను చేరుకోవాలంటే దేశంలోని ప్రముఖ విద్యాలయాలన్నింటిలో కూడా అంకుర సంస్థలు, నైపుణ్య అభివృద్ధి సంస్థలు ఏర్పడాలని, శాస్త్ర సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలు జరగాలని, వాటిద్వారా విద్యార్థులను ఉత్తమమైన శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ సెంటర్(ఐజర్) ఆధ్వర్యంలో తిరుపతిలోని రాష్ట్ర మరియు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటి, స్విమ్స్, వేదిక్ విశ్వవిద్యాలయం మొదలైన ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో తిరుపతిలో శాస్త్ర, పరిశోధన రంగాలలో నూతన ఆవిష్కరణల కోసం ఇంకుబేషన్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించడానికి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుపతిలోని విశ్వవిద్యాలయాలు మరియు ఇతర ఉన్నత విద్యాసంస్థల అధికారులందరూ కలిసి రాబోయే రోజులలో తిరుపతిలో అంకురాలు మరియు నైపుణ్యాభివృద్ధి రంగాలలో విద్యార్థు లకు తగిన శిక్షణ ఇచ్చే విధంగా కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2030వ సంవత్సరానికి ప్రపంచంలోని వర్క్ ఫోర్సులో దాదాపు 40శాతం భారతీయులే ఉంటారని, తద్వారా ప్రపంచ దేశాలలో భారతదేశానికి ప్రముఖస్థానం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతానం భట్టాచార్య, ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సత్యనారాయణ, వేదిక్ విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాణి సదా శివమూర్తి, సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.కుమార్, ఏబి ఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్ష, కోశాధికారులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు తుఫాన్ సాయం అందించిన ఆదాల



నెల్లూరులోని 24వ డివిజన్ ఆర్టీటీ కాలనీలో తుఫాన్ బాధితులకు నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాయం అందించారు. ఈ ప్రాంతంలో అన్ని మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో తుఫాన్‌కు నష్టపోయినవారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోను, జిల్లా కలెక్టర్ హరినారాయణ్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌లతో ప్రత్యేకంగా చర్చించి తుఫాను సాయం అందరికీ అందే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం, బాధితులకు రూ.2500లతోపాటు 25కేజీల బియ్యం, ఒక్కొక్క కేజీ చొప్పున కందిపప్పు, ఎర్రగడ్డలు, ఉల్లగడ్డలు, వంటనూనె తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. నగర మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డివిజన్ నాయకులు అరవ కామాక్షి, నీళ్ల సునీల్ యాదవ్, ఉడతా మురళి యాదవ్, ఇసనాక సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వైకుంఠ ఏకాదశి





వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాల్లో ముక్కోటి ద్వారదర్శనాలతో ఆలయాలు క్రిక్కిరిసిపోయాయి. శ్రీమహావిష్ణువు ఆ రోజున ఉత్తర ద్వారంలో దేవతలకు దర్శనమిచ్చారని, అదేవిధంగా స్వామివారిని ఉత్తర ద్వారదర్శనం ద్వారా వెళ్ళి దర్శించుకుంటే పుణ్యం కలుగుతుందని భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. ద్వారదర్శనం ప్రారంభం కాగానే భక్తుల గోవింద నామోచ్చారణలతో ఆలయం మార్మోగిపోయింది. తొలుత, ఆలయ అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామివారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. దేవస్థానంలో కొలువై ఉన్న గోదాదేవి మందిరం, ఆళ్వార్ల మందిరాల్లోనూ విశేష పూజలు చేశారు. అదేవిధంగా నగరంలోని వేణుగోపాలస్వామి దేవాలయంతో పాటు కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరాలయం, వేదగిరిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం తదితర దేవాలయాల్లో ముక్కోటి ద్వార దర్శనాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వారదర్శనం ద్వారా స్వామివార్లను దర్శించుకుని తరించారు.

## కాంగ్రెస్ గెలిస్తే..

# తొలి సంతకం 'ప్రత్యేక హోదా'కే



రానున్న ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను తీసుకురావడం కోసమే తొలి సంతకం చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి హామీ ఇచ్చారు. ఇటీవల ఆయన నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి అధ్వర్యంలో స్థానిక ఇందిరా భవన్‌లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి పార్టీ సమన్వయ సమితి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ-వైసీపీ ప్రభుత్వాలు రెండూ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఆ రెండు ప్రభుత్వాల పాలనలో రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టును, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, మరోవైపు వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలపై అప్పుల భారం పెరిగిందని ఆయనన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి కట్టుగా ప్రణాళికాబద్ధంగా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. డీసీసీ నేత చేవూరు దేవకుమార్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రత్యేక చొరవతో తాజాగా కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధించడం హర్షదాయకమన్నారు. ఆ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రజలు కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో విజయసాధనకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సీవీ శేషారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేశ్‌బాబు, డీసీసీ ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు చింతాల వెంకట్రావు, దుద్దుకూరు రమేష్ నాయుడు, పరిమళ వెంకటేశ్వర్లు, కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అనిల్‌కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్‌బాబు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు రాజా, ఐఎన్‌టియుసి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.







ప్రథమ వర్ధంతి



జననం 1930

నిర్యాణం 2023

మానవతామూర్తి, ఆత్మీయదీప్తి

మంగలపూరు రామసుబ్బమ్మ గారు

(కీ။శే။ రామసుబ్బారెడ్డి గారి సతీమణి - మానమాల, ఓజిలి మండలం)

పరమపదించి తేది. 02.01.2024 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా

ఆ ప్రేమమూర్తి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారుడు - కోడలు

ఎం.చంద్రశేఖర్‌రెడ్డి - ధనసేన

మనుమడు - మనుమరాలు: శ్రీచరణ్ - శ్వేత

మనుమరాలు - మనుమడు: సాయిశరణ్య - శ్రీకాంత్

ముని మనుమళ్ళు

ధృవ్‌సాయి, ధీరవ్‌సాయి



# అంతర్జాతీయ సదస్సుల్లో.. ఎన్‌బికెఆర్ విద్యార్థులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మెకానికల్ విద్యార్థులు వారణాసి ఐఐటీలో నిర్వహించిన తొమ్మిదవ అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కె.సంతోష్‌కుమార్, ఎస్.ధనుష్, కె.సురేష్ పాల్గొని "ఇన్వెస్టిగేషన్ ఆన్ మెకానికల్ అండ్ మెటలర్జికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సి.ఎం.టి–డబ్ల్యుఏఏఎం ఆఫ్ కాపర్ కోటెడ్ ఎమ్మెన్ – ఎస్సై అల్లాయ్ స్టీల్, ఇన్వెస్టిగేషన్ ఆన్ "ఇన్ఫ్లుయెన్స్ ఆఫ్ వేరియస్ ఆపరేటింగ్ పెరామీటర్స్ ఇన్ వైర్ ఆర్క్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూజింగ్ ఇఆర్4043 అల్యూమినియం అల్లాయ్" అనే అంశాలపై ప్రసంగించారు. అదేవిధంగా ఇటీవల మద్రాస్ ఐఐటీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మెకానికల్ ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులు షేక్ హర్షద్, షేక్ జన్నత్ హుస్సేన్ పాల్గొని 'మిషన్ విజన్–సర్ఫేస్ టెక్చర్' అనే అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ సి.హెచ్.ఆర్.విక్రమ్ వారిని అభినందించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఆదిశేషారెడ్డి స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్ర'



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ఈ నెల 26న గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు, వైకాపా సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డిలు ప్రారంభించారు. గూడూరు పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బత్తిని విజయ్‌కుమార్, కోడూరు కల్పలత, నాయకులు కొండూరు సునీల్‌రెడ్డి, మనుబోలు కృష్ణయ్య, వైకాపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల ఎంపిక జగన్‌దే



ఇటీవల నెల్లూరుకు వచ్చిన జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని గూడూరు జాతీయ రహదారి వద్ద సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కలిశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీలో ఎమ్మెల్యే అభ్యర్థుల నియామకం పూర్తిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని, సూళ్లూరుపేట వైకాపాలో వర్గ విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని, కానీ ఎవరైనా దూషణలకు దిగినా, దాడులకు దిగినా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆధ్యాత్మిక దివ్యానుభూతులు కలిగించే.. 'పాశుర గీతా సౌరభం'

ఆండాళ్ ఏడవ శతాబ్దికి చెందిన విష్ణు భక్తురాలు. ఆమె భూదేవి అంశ. తండ్రి విష్ణుచిత్తుడు. స్వగ్రామం శ్రీవిల్లిపుత్తూరు. విష్ణుచిత్తుడ్ని 'పెరియాళ్వార్' అంటారు. పన్నిద్దరు ఆళ్వార్లలో మహిళా ఆళ్వార్ ఆండాళ్ మాత్రమే. ఆమెను గోదాదేవి, ఆముక్తమాల్యద, చూడి కొడుత్త నాచ్చియార్ మొదలైన పేర్లతో పిలుస్తారు. ఆమె అయోనిజ. విష్ణుచిత్తుడు వటపత్రశాయి ఆలయ సమీపంలో ఉన్న తులసివనంలో మొక్కలకు గోతులు తవ్వుతున్న సమయంలో ఆండాళ్ లభించింది. ఆయన ఆమెకు 'కోదై' అనే నామకరణం చేశారు. 'కోదై' అంటే పూలదండ అని అర్థం.

ఆండాళ్ చిన్నప్పటి నుండే భక్తి, జ్ఞాన, వైరాగ్యాల మీద ఆసక్తి కలిగి వుండేది. శ్రీకృష్ణుని ఆరాధనలో తరించాలనుకుంది. ఆయన్నే వివాహమాడదలచింది. ఆండాళ్ అంటే 'పాలించునది' అని అర్థం. ఆమె రచించిన ప్రబంధాలు రెండు. 1) తిరుప్పావై (30 పాశురాలు), 2) నాచ్చియార్ తిరుమొళి (142 పాశురాలు). ఇవన్నీ ద్రావిడ భాషలో ఉన్నాయి. శ్రీకృష్ణుడు 'భగవద్గీత'లో తాను మార్గశిర మాసాన్ని అంటాడు. ఆ మాసమే ధనుర్మాసంగా ప్రసిద్ధమైంది. ఆధ్యాత్మికోన్నతికి ఆయువు పట్టు అయింది.

గోదాదేవి వ్రతం చేస్తూ తన చెలులతో దైవదర్శనం చేసిన విధానం పాశురాలలో వివరించడం జరిగింది. చిత్తశుద్ధితో భగవంతుడ్ని ప్రార్థిస్తే వర్షాలు కురిసి, పంటలు పండి దేశం సుభిక్షంగా ఉంటుందని మొదటి 5 పాశురాలు తెలియజేస్తాయి. శ్రీకృష్ణుని పూలతో పూజిస్తే పాపాలు నశిస్తాయి అని గోదాదేవి ఉపదేశిస్తుంది. తరువాత 10 పాశురాలలో గోదాదేవి చెలులతో కలిసి పూలను సేకరించడం, పల్లెలోని ప్రకృతి రమణీయతను వర్ణించడం, భగవంతుని అవతారాలను వర్ణించడం ఉంటాయి. ఆ తరువాత 5 పాశురాలలో గోదాదేవి చెలులతో దేవాలయ దర్శనం, సుప్రభాతం ఉంటాయి. చివరి 9 పాశురాలు భగవద్విభూతిని వర్ణిస్తాయి. చివరి పాశురంలో తను విష్ణుచిత్తుని కుమార్తెనని 30 పాశురాలు తాను రచించి, గానం చేశానని, వీటిని భక్తితో ఎవరైతే గానం చేస్తారో.. వారికి భగవత్ కృప కలుగుతుందని చెపుతుంది. ఇదీ గోదాదేవి గురించిన రేఖామాత్ర పరిచయం.

గొప్ప ఆధ్యాత్మిక సంపన్నులు, బహుగ్రంథకర్త, ప్రకాశం జిల్లా వాస్తవ్యులు, విశ్రాంత కళాశాల ప్రిన్సిపాల్ పింగళి పాండురంగారావు 'పాశుర వైభవం' పేరుతో 2015లో ఒక గ్రంథాన్ని వెలయించారు. అయితే, అందులోని పాశురాలన్నీ తమిళంలో ఉన్నాయి. వాటిని తెలుగువారికి అందుబాటులోకి తేవడానికి ఆయనకు చిరకాల మిత్రుడు, కవి.. బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని కోరడం, ఆమేరకు రాధాకృష్ణమూర్తి కూడా భక్తితో ఆ అనువాదాన్ని అద్భుతంగా చేయడం జరిగింది. ఆ గ్రంథాన్ని 'పాశుర గీతా సౌరభం' పేరుతో ముద్రించి పింగళి వారు భక్తులకు ఉచితంగా అందించడం విశేషం.

గోదాదేవిలో భక్తి పారవశ్యమే కాదు, దేశ సంక్షేమాన్ని గురించిన ఆకాంక్ష కూడా నిండి ఉంటుంది. ఆ విషయాన్నే 'బొగ్గరపు' వారు ఇలా అనువదించారు. నెలకు మూడు వానలూ అదనుగా కురవాలి / చేతిలో వరి వంగడాలు పదునుగా పెరగాలి / దేశం సుభిక్షంగా సిరిసంపదలతో నిండాలి / జనం సంక్షేమంతో సుఖశాంతులు కలిగుండాలి!..

'మనసా వాచా కర్మణా ఆశ్రయిస్తే అభయమిస్తావు / దుర్మార్గులకు సన్మార్గపు జ్ఞానచిత్తం ప్రసాదిస్తావు / సర్వశక్తి సంపన్నుడవైన శ్రీకృష్ణా / ఇక మేలుకో / ఆపన్నులను ఆదుకునే గోపాలుడా! మమ్ము ఏలుకో / అంటూ తన ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణుని ఆమె వేడుకోవడం గోదాదేవిలోని భక్తి తత్వానికి పరాకాష్ట. మరొకచోట ఆమె ఇలా అంటారు... 'శ్రీకృష్ణా! గుంపులు గుంపులుగా చేరుకున్న మేమందరం / నీ సింహాసనానికి తెంపులుగా మారితేనే సుందరం / అని. ఎంతటి రమణీయత వుంది ఈ పాశురంలో – మధురభక్తికి ఇంతకంటే ఉదాహరణ ఏం కావాలి?

శ్రీకృష్ణుడు 'నిష్కామకర్మ'కు తిరుగులేని ఉదాహరణ. ఆయన జీవితమంతా ఫలితం ఆశించని పనులతోనే సాగిపోయింది. గీతలో కూడా ఆయన అదే నొక్కి చెప్పాడు. 'ఏది చెప్పాడో, అదే జీవితాంతం చేశాడు' శ్రీకృష్ణుడు. అందుకే ఆయన భగవంతుడయ్యాడు. ఆ విషయాన్నే అనుసరిస్తున్నానని గోదాదేవి ఒక పాశురంలో ఇలా చెప్పారు 'నిష్కామకర్మలలో దాస్యభక్తితో మేము తరిస్తాం / కోరికల తారకల్ని, మానసాకాశంలో హరిస్తాం'ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి పాశురం ఒక దివ్యమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ముక్తిమార్గాన్ని చూపిస్తుంది. అందులోనూ మహిళలకు 'విద్య' లేని ఆనాటి రోజుల్లోనే ఆమె అంతటి పాండిత్యాన్ని ఎలా సంపాదించింది? అనే విషయం ఆశ్చర్యమే. అది ఆమెకు ఆ భగవంతుడిచ్చిన వరం. పూవు పుట్టగనే పరిమళించినట్టు కోదై (పూదండ) అనే పేరుగల ఆమె, చిన్ననాటి నుండే శ్రీకృష్ణ భగవానుని ఆరాధనలో తరించడం, పాశురాలనే ఆధ్యాత్మిక జ్ఞానసంపదను భక్తజనావళికి అందించడం..అంతా ఆ దైవ కృపే!..అందుకే ఆమె పూజనీయురాలైంది. ఏదేమైనా, తమిళంలో పాశుర వైభవాన్ని రచించడమేగాక, తెలుగులో వాటిని అనువదింపజేయడం పింగళివారి సంస్కారమైతే, ఆయన లక్ష్యాన్ని నూటికి నూరు పాళ్ళు సఫలీకృతం చేయడం బొగ్గరపు వారి కవితా ప్రతిభకు నిదర్శనం. ఇరువురూ అభినందనీయులే!..




**పాశుర గీతా సౌరభం**
రచయిత:
**బొగ్గరపు రాధాకృష్ణమూర్తి**
పేజీలు : 68 వెల. అమూల్యం
ప్రతులకు : పింగళి పాండురంగరావు
"శ్రీరంగధామం", 8-71, లాయర్‌పేట,
ఒంగోలు. సెల్ : 94405 54114.



**డా. గంగిశెట్టి శివకుమార్**
నెల్లూరు. సెల్: 9441895343.

# తాళమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



గూడూరులోని తాళమ్మ దేవస్థానం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఆలయ అభివృద్ధి అడ్‌హాక్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం శ్రీశ్రీశ్రీ తాళమ్మ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి గౌరవ సలహాదారులు నాగేశ్వరరావుగౌడ్, రఘురామయ్య గౌడ్, ధనుంజయ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నూతన అడ్‌హాక్ కమిటిని నియమించారు. కమిటీ సభ్యులగా చిట్టెం శ్రీనివాసులు గౌడ్, రఘురామ్‌గౌడ్, రాంమోహన్ గౌడ్, మస్తానయ్య గౌడ్, సునీల్ గౌడ్, అన్నం మురళి గౌడ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం పలువురు గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ తాళమ్మ దేవస్థానంలో పూర్తిగా దెబ్బతిన్న గంగమ్మ దేవాలయం పునర్నిర్మాణానికి సహకరించిన విశ్రాంత షార్ ఉద్యోగి మారుబోయిన సుబ్బారావు గౌడ్‌ను నూతన అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# మోత మోగించిన అంగన్‌వాడీలు



గూడూరులో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 26వ తేదీకి 15వ రోజుకు చేరుకున్నాయి. సమ్మెలో భాగంగా దీక్షా శిబిరం నుండి ప్రదర్శనగా బయలుదేరి టవర్ క్లాక్ సెంటర్‌కు చేరుకొని కంచాలును గరిటలతో మోగిస్తూ నిరసన తెలియజేశారు. అనంతరం కోలాటం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏ హామీలు అయితే ఇచ్చారో వాటిని అమలు చేయమని కోరుతున్నా గత రెండేళ్లుగా జగన్ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లైనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ అధ్యక్షురాలు ఏ.ఇంద్రావతి, ఆశా వర్కర్లు కె.జానకి, హేమ, సూర్యావతి, రఫియ, లక్ష్మీ, మల్లేశ్వరి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్, బి.చంద్రయ్య, గుర్రం రమణయ్య, ఏ ప్రసాద్, సెక్టార్ లీడర్లు పెంచలమ్మ, భారతి, ముని, మంగమ్మ, హైమావతి, ప్రసన్న పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల కష్టాలు తీర్చండి



గూడూరులోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ నెల 26 నుండి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెను చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చేసే సేవకు కాళ్ళు కడగాలని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కనీసం వాళ్ళ కన్నీళ్లు కూడా తుడవడం లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులు బి.రమేష్, కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, శ్రామిక సంఘం అధ్యక్షురాలు బి.ప్రభావతి, కార్యదర్శి ఎం.సంపూర్ణమ్మ, మురళి, జోగి శివకుమార్, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, ఆర్.శ్రీనివాసులు, ఏ.ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు.. శ్రీసిటీ పరిశ్రమ చేయూత

## ○ రూ.10 లక్షల విలువైన డిజిటల్ పరికరాల వితరణ

కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా సాంకేతిక విద్యకు సహకారం అందిస్తూ, శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ (ఐఎంఒపి) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఇటీవల తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 10 లక్షలు విలువచేసే విద్యా సామగ్రిని విరాళమిచ్చింది. స్టీల్-సంబంధిత వస్తు పరీక్షలకు అవసరమైన యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్‌తో పాటు ఆటోక్యాడ్ డిజైనింగ్ కోర్సు సులభతర అభ్యసన కోసం మూడు క్లాస్‌రూమ్‌లకు ఎల్సీడి ప్రొజెక్టర్, సీపీయు ఇతర డిజిటల్ పరికరాలను వితరణగా అందచేసింది. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో



ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఐఎంఒపి మేనేజింగ్ డైరెక్టర్ తయోజో ఇవామి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించే తమ లక్ష్యంలో భాగంగా ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలకు వితరణ ఇవ్వడం తమకు సంతోషంగా ఉందన్నారు. ఆ పరిశ్రమ సాయం పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ ఆ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వై. ద్వారకానాథరెడ్డి ఈ సందర్భంగా తమకు చేయూతనందించిన శ్రీసిటీకి, ఆ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పీకేను... చంద్రబాబు పిలిచింది అందుకే!

బీహార్‌కు చెందిన "ఎన్నికల వ్యూహకర్త" ప్రశాంత్ కిషోర్ అయిదారు రోజుల క్రితం నారా లోకేష్‌తో కలిసి హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో మూడున్నర గంటలు సమాలోచనలు జరిపారు అనే వార్త మీడియాలో బహుళ ప్రచారం అయింది. యూట్యూబ్ ఛానెళ్ళలో అయితే, చిలవలు, పలవులుగా జనం మీద విరుచుకుపడింది. తెలుగుదేశం విజయానికి ప్రశాంత్‌కిషోర్ రంగంలోకి దిగేశారు అనే సందేశం రాష్ట్రం నలుమూలలకూ క్షణాల్లో చేరిపోయింది. తెలుగుదేశంకి రావలసిన పొలిటికల్ మైలేజ్ వచ్చేసింది. చంద్రబాబు లక్ష్యం సగం నెరవేరింది. చంద్రబాబుకు తెలియని సలహాలు ఏవో కొత్తగా ప్రశాంత్ కిషోర్ (పీకే) ఇవ్వాల్సిన పనిలేదు. ఆయన పేరు ఎన్నికల భారతంలో ఓ బ్రాండ్‌గా గత దశాబ్దంగా మారుమోగిపోతోంది. ఆయన పేరు తెలియని రాజకీయ ఆసక్తిపరులు తెలుగు రాష్ట్రాలలో బహు అరుదుగా ఉంటారేమో.

"ఎన్నికల వ్యూహకర్త"గా ఆయనకు లభించిన ప్రచారం అంతాఇంతా కాదు.

దేశంలో 1952 నుంచీ ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ఏ వ్యూహాలూ లేకుండానే రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల్లో గెలవడం లేదు కదా! ఏ పార్టీకి ఉండే వ్యూహాలు ఆ పార్టీలకు ఉంటాయి.

అయితే అన్ని జీవన రంగాలు, పనులు, ఆలోచనలు, నడవడికల్లో "హైటెక్" టెక్నిక్‌లు చోటు చేసుకుంటున్నరోజులు ఇవి. హైటెక్ ఆలోచనల్తో, వాటి అమలుతో ఎన్నికల్లో గెలవవచ్చు అనే ఒక కొత్త రకం ట్రెండ్‌కు శ్రీకారంచుట్టిన తెలివైన పిండం... ప్రశాంత్ కిషోర్.

2012లో జరిగిన గుజరాత్ ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి మోడీకి ఈ టెక్నిక్ ఆయన రుచి చూపించారు.

ఆయన మూడవసారి ముఖ్యమంత్రి కావడం కోసం "ఎన్నికల ఐడియా"లు కొన్ని పీకే ఇచ్చారు. అవి వర్క్‌ఔట్ అయ్యాయా అన్నట్టుగా మోడీ పార్టీ(బీజేపీ) గెలిచి, ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. దాంతో పీకేపై నరేంద్ర మోడీకి గురి కుదిరింది.

2014 లోక్‌సభ ఎన్నికలలో "ఎన్నికల ఐడియా"ల కోసం పీకేను మోడీ రంగంలోకి దించాడు. బీజేపీ సూపర్ హిట్ అయింది. అంత పెద్ద వాజేపేయికి లభించని సంపూర్ణ మెజారిటీ, మోడీకి లభించడంలో పీకే పాత్ర ఉందనే ప్రచారం హోరెత్తి పోయింది. దాంతో పీకే పేరు మారుమోగిపోయింది. ఎన్నికల ఐడియాలు అన్నీ ఆయన బుర్రలోనే పొరలు పొరలుగా పేరుకుపోయి ఉన్నాయన్నట్టుగా దేశంలోని రాజకీయ నాయకులు ఆయన కోసం ఎగబడ్డారు.

ప్రజా జీవితంలో కాకలు తీరిన నేతలు కూడా.... "ఎందుకైనా మంచిది, ప్రశాంత్ కిషోర్‌ను పెట్టుకుందాం..." అనే భావన వివిధ పార్టీల నేతల్లో బలపడిపోయింది.

బీజేపీ మాత్రమే కాక, జేడీ(యు), కాంగ్రెస్, ఆప్, వైసీపీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ మొదలైన పార్టీల నేతలు పీకే ఐడియాల కోసం ఎగబడ్డారు. ఆయన ఐడియాల కోసం వందల కోట్లు సమర్పించుకున్నారని మీడియాలో వార్తలు వచ్చాయి. ఎవరెవరు ఎంతెంత సమర్పించుకున్నారో అనే వివరాలు పబ్లిక్ డొమైన్‌లో లేవు. ఎంత వైటో... ఎంత బ్లాకో కూడా తెలియదు. కానీ, ఆయన ఐడియాలు ఇస్తే మాత్రం... ఐడియాలు తీసుకున్న పార్టీ ఎన్నికల్లో గెలవడం ఖాయం అనే అభిప్రాయం అటు రాజకీయాలలోనూ, ఇటు రాజకీయ ఆసక్తి పరుల్లోనూ బలంగా ఏర్పడిపోయింది.

ఈ బలమైన అభిప్రాయం పేరే.. పబ్లిక్ పెర్సెప్షన్.

ఈ పెర్సెప్షన్ ఇంత బలంగా జనంలోకి వెళ్ళిపోడానికి కారణం లేకపోలేదు.

ఐడియాలు ఇవ్వడానికి ఆయన బేరం ఒప్పుకున్న యూపీ కాంగ్రెస్, బెంగాల్ మమతా బెనర్జీ, ఢిల్లీ కేజ్రీవాల్, బీహార్ నితీష్‌కుమార్, తమిళనాడు స్టాలిన్, ఆంధ్ర జగన్, గుజరాత్ మోడీ వగైరాలలో యూపీ కాంగ్రెస్ మినహా అన్ని రాష్ట్రాల్లోనూ ఆయనతో టై-అప్ అయిన నేతలు గెలిచారు. ముఖ్యమంత్రులు అయ్యారు.


తమ శక్తిసామర్థ్యాలకు ఈ పీకే ఐడియాలు తోడైతే గానీ ఎన్నికల్లో గెలవలేమనే పెర్సెప్షన్ రాజకీయ నాయకుల్లో మరింతగా బలపడిపోయింది.

ఆయన టీమ్‌లో ఐఐటీల్లో చదివినవారు, ఉన్నత విద్యావంతులు ఉండడంతో.... తన సేవలకు వందల కోట్లలో ఫీజును ఆయన డిమాండ్ చేస్తుంటారని వినికిడి. అంటే.. డైరెక్ట్‌గా రాజకీయాల్లో చేరి ఇసుక, కొండలు, గనులు తవ్వేసి, బ్రోకరేజ్‌లు, కాంట్రాక్టులు, కమిషన్లు వగైరా పనులు చేసి... సిగ్గొదిలేసి సంపాదించే దాని కన్నా కూడా సౌండ్ లేకుండా, వంటికి చమట పట్టకుండా, చేతికి మట్టి అంటకుండా, రూపాయి పెట్టుబడి లేకుండా... పీకే పీకుడు చాలాఎక్కువ అనేది విశ్లేషకుల మాట. బుర్రలో గుజ్జు, చేతిలో లాప్‌టాప్‌తో ఆయన దేశ రాజకీయాలతో ఆడుకుంటున్నాడు.

చాలా సందర్భాలలో.. పౌర సమాజం హర్షించ లేని మురికి ఐడియాలు కూడా ఆయన ఇస్తుంటారనే విమర్శలు కూడా మనం వింటుంటాం. 2019లో వైసీపీకి ఆయన ఇలాంటి ఆలోచనలు చాలానే ఇచ్చారంటూ మీడియాలో చాలా కథనాలు వెలువడ్డాయి కూడా. బేరం కుదుర్చుకోడానికి ఆయనకు ఏ పార్టీ అయినా ఒకటే! ఎంకికి, సుబ్బికి తేడా ఏమీ లేదు. "క్యాష్ అండ్ క్యారీ" ఆయన పాలసీ అనిపిస్తుంటుంది, ఆయన క్లయింట్స్ లిస్టు చూస్తుంటే.

బీజేపీకి వ్యూహకర్తగా పనిచేసిన ఆయన, బీజేపీకి బద్ధశత్రువైన మమతా బెనర్జీకి బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహకర్తగా పనిచేశారు. మోడీకి బద్ధ శత్రువైన ఢిల్లీ కేజ్రీవాల్‌కు పనిచేశారు. మోడీకి బద్ధశత్రువుగా మారిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కు పనిచేశారు.

మంచి యాంబిషియస్ పర్సన్. రాష్ట్రాలతో సంతృప్తి పడక, మొత్తం కాంగ్రెస్ పార్టీని గుటుక్కుమని మింగేద్దామని... సోనియాకు గేలం వేసి చూశారు. ప్రశాంత్ కిషోర్ అసలు ఐడియా రాహుల్‌గాంధీకి, ప్రియాంకకు అర్థమైంది. "నీకూ... నీ ఐడియాలకూ




ఓ నమస్కారం. మా రాజకీయం మేం చేసుకుంటాం. మమ్మల్ని ఇలా వదిలేయ్..." అంటూ ఆయనకో నమస్కారం పెట్టి వదిలించేసుకున్నారు.

ఆయనకు ప్రత్యేకమైన రాజకీయ సిద్ధాంత రాద్ధాంతాలు ఏమీ లేవు. పేమెంటే ఇంపార్టెంటు.

మొత్తంమీద, "ఎన్నికల వ్యూహం" పేరు మీద.... కోట్లాది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ముఖ్యమంత్రులతో ప్రశాంత్ కిషోర్ ఆడుకుంటున్నారు. 'హాట్స్ అఫ్ టు హిజ్ బ్రిలియన్స్' అని సెల్యూట్ చేయాల్సిందే, ఎవరైనా.

అటువంటి గండరగండడు అయిన ప్రశాంత్ కిషోర్‌ను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రంగంలోకి దించారు... అంటే తగిన కారణం ఉండకుండా ఉండదు.

ఆయన "సలహా"లు అంత అవసరమై ఉండక పోవచ్చు.

మూడుసార్లు ముఖ్యమంత్రిగాను, మూడుసార్లు ప్రతిపక్ష నేతగాను పని చేసిన చంద్రబాబునాయుడుకు ఎన్నికల్లో ఎలా గెలవాలో... ఎలా ఓడిపోవాలో.. ఒకరు చెప్పే పనేమి ఉంటుంది? ఆయనకు తెలియని కొత్త "సలహా"లు ఏముంటాయి?



ప్రశాంత్ కిషోర్ అంటే ఒక విజయ సంకేతం అనే భావన జనం బుర్రలకు బాగా పట్టేసింది. ఆ భావనను మరింత దృఢంగా జనంలోకి తీసుకెళ్ళాలి అనే భావనతో ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమై ఉంటారు.

గెలిచే అవకాశం ఉన్న పార్టీలను పీకే పట్టుకున్నా లేక గెలిచే పార్టీలే ధైర్యం చాలక ఆయనను పట్టుకున్నా... మొత్తంమీద ఆయన ఏ పార్టీకి "వ్యూహకర్త"గా ఉంటే ఆ పార్టీ గెలుస్తుందనే భావం జనంలో ఉంది. ఇది ఒక రకంగా మైండ్ గేమ్. తటస్థులు కూడా ప్రశాంత్ కిషోర్‌తో టైఅప్‌లో ఉన్న పార్టీ వైపు మొగ్గడానికి అవకాశం ఉన్న మైండ్ గేమ్.

ఆ భావన, పబ్లిక్ పెర్సెప్షన్ గెలుపోటములను బాగా ప్రభావితం చేస్తుంది.

సంప్రదాయ రాజకీయాల్లో అయితే, ఈ పబ్లిక్ పెర్సెప్షన్ అనుకూలంగా లేని పార్టీలు ఓడిపోతుంటాయి. మొన్న తెలంగాణలో చూశాం కదా!

ఎక్కడ చూసినా కాంగ్రెస్.... కాంగ్రెస్... అంటూ జనం కాంగ్రెస్ నామస్మరణ చేశారు. ఫలితాలు కూడా "పబ్లిక్ పెర్సెప్షన్"నే ప్రతిబింబించాయి.

ఇప్పుడు ఆంధ్రాలో కూడా "తెలుగుదేశం...", "చంద్రబాబు..." అనే నామస్మరణ మార్మోగిపోతోంది. ఆంధ్రలో ప్రస్తుత "పబ్లిక్ పెర్సెప్షన్" ఇది.

అయితే, ఆంధ్రలో ఇప్పుడు నడుస్తోంది "సంప్రదాయ" రాజకీయ సరళి కాదు. ఇప్పుడు ఆంధ్రలో నడుస్తున్న రాజకీయాన్ని నిర్వచించడం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్లకు కూడా అయ్యే పని కాదు. కాబట్టి, ఎన్నికల ఫలితాలలో ఈ "పబ్లిక్ పెర్సెప్షన్" ఏ మేరకు ప్రతిఫలిస్తుందో తెలియడం లేదు.

బహుశా, ఈ తరహా "ముందు జాగ్రత్త" ఏదో ఆలోచించే, ఆ ఎన్నికల వ్యూహ మాంత్రికుడిని చంద్రబాబునాయుడు విజయవాడ పిలిపించి ఉండవచ్చు. దీనివల్ల..

- తెలుగుదేశం గెలుపు ఇక ఖాయం అనే భావన జనంలోకి బలంగా, విస్తృతంగా వెళ్ళిపోతుంది. పోయింది కూడా. చంద్రబాబు వ్యూహం వల్ల, పైకి కనపడని లాభాలు అనేకం ఉన్నాయి.
- ప్రశాంత్ కిషోర్‌తో అంటకాగిన వైసీపీ... ఆత్మరక్షణలో పడిపోతుంది. దడ, చమట, వణుకు... మొదలైనవి ఈ "ఆత్మ రక్షణ" లక్షణాలుగా ఉంటాయని రాజకీయ వైద్యులు చెబుతుంటారు.
- ప్రశాంత్ కిషోర్ లేకుండా గెలవగలమా అనే అధైర్యానికి వైసీపీ శ్రేణులు లోనవుతాయి.
- ఇక, మనం గెలవడం ఖాయం అనే భావన తెలుగుదేశం శ్రేణులలో ఏర్పడి, ఉత్సాహంతో ఉరకలెత్తుతాయి.

జేబులో రెండు వేల నోటుపెట్టి, నడవమంటే... ఎవరైనా ఎంత దూరమైనా నడుస్తారు. అది తీసేసి, నడవమంటే, ఓ ఫర్లాంగు కూడా నడవలేరు.

అలా, జేబులో ఉండే రెండువేల రూపాయల నోటు లాంటి వారు.. ప్రశాంత్ కిషోర్. పైకి కనిపించరు.

అందుకే, చంద్రబాబు.... ఆయనను పిలిపించి ఉంటారు.


ఆయనను పిలిపించడం వల్ల, టీడీపీకి రావలసిన పొలిటికల్ మైలేజ్ ఇప్పటికే వచ్చేసింది. వైసీపీ కూడా ఆ విషయాన్ని గుర్తించిందనడానికి అంబటి రాంబాబు, పేర్ని నాని, కొడాలి నాని ఆక్రోశపు వ్యాఖ్యలే నిదర్శనం.

ఇక, ప్రశాంత్‌కిషోర్ తెలుగుదేశం అధినేతకు సూచించారు అంటూ వివిధ ఛానెళ్ళలో ట్రోలింగ్ అవుతున్న "సలహా"లు.... నిజానికి చంద్రబాబుకు తెలియనివి ఏమీ కావు. "ఇంగిత జ్ఞానం"తో ఆలోచించే వారెవరికైనా తట్టేవే. కానీ, "కోచ్" ముఖతా వింటే... విలువ ఎక్కువ. అందుకే, సచిన్ టెండూల్కర్, ధోని లాంటి దిగ్గజ క్రికెటర్స్‌కు కూడా ఒక బ్యాటింగ్ కోచ్, ఫీల్డింగ్ కోచ్ ఉంటారు కదా!

చంద్రబాబునాయుడు ఈ వయసులో రేయింబవళ్ళు కష్టపడుతున్నా, లోకేష్ మూడువేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినా... రేపు తెలుగుదేశం గెలిస్తే, క్రెడిట్ అంతా ప్రశాంత్ కిషోర్ ఖాతాలో పడిపోతుంది. ఆయన వ్యూహకర్తృత్వం వల్లే తెలుగుదేశం గెలిచింది అనుకుంటారు. ఆయన బ్యాంకు అకౌంట్ మరింత బరువెక్కుతుంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## కల్యాణ వైభోగం...!




నెల్లూరు వాస్తవ్యులు కామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి - శమంతల కుమారుడు **ప్రశాంత్‌రెడ్డి - దీపిక** (చెన్నై వాస్తవ్యులు ఎస్.బాలసుబ్రమణియన్ - సుందరిల కుమార్తె)ల పరిణయం డిసెంబర్ 14వ తేదీ చెన్నైలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# ఆంధ్రా పార్టీలకి అభ్యర్థులు కావలెను

(మొదటి పేజీ తరువాయి)

ఒకప్పుడు రాజకీయ నేతలంటే ఎన్నికల సమయంలో ఒకరినొకరు ప్రత్యర్థులుగా మాత్రమే భావించేవారు. ప్రచారంలో సైతం ఒకరికొకరు ఎదురుపడితే పరస్పరం "ఆల్ ది బెస్ట్" అని చెప్పుకునేవారు. ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చాక.. ఓడినవారూ, గెలిచిన వారూ ఇద్దరూ స్నేహపూరిత వాతావరణంలో తమ ప్రాంత అభివృద్ధి కోసం కలసి పనిచేసేవారు. స్వపక్షం, విపక్షం అన్న తేడాలేకుండా మనమంతా ప్రజల పక్షం అన్న భావంతో మెలిగేవారు. 2019 ఎన్నికల తరువాత ఆంధ్ర రాజకీయాల ట్రెండు మారింది. "రారా చూసుకుందాం, తన్నుకుందాం, తేల్చుకుందాం" తరహా పాలిటిక్స్‌కి ఆంధ్రలో తెర లేచింది. అభివృద్ధిలో పోటీపడడం మానేసి అవినీతిలో పోటీపడుతున్నారు. "నువ్వు వంద కోట్లు తిన్నావు కాబట్టి, నేను రెండొందల కోట్లు తింటా... అడిగే అర్హత నీకు లేదు" అని సిగ్గు, రోషం, మానం, మర్యాద లేకుండానే బహిరంగంగా తమ అక్రమ సంపాదన వ్యవహారాలని బయట పెట్టుకుంటున్నారు. "నేను మంత్రిగా ఉన్న సమయంలో కొంతమంది దగ్గర డబ్బులు తీసుకున్నాను, నేనేమీ నీతిమంతుడినని చెప్పను. మాకూ ఖర్చులు ఉంటాయి కదా...!" అని ఇటీవల ఒక మాజీమంత్రి బహిరంగ సమావేశంలోనే మాట్లాడడం ప్రస్తుత రాజకీయ నాయకుల నడవడికకి ప్రత్యక్ష ఉదాహరణ.

ఇలాంటి పరిస్థితులలో రేపు 2024 సమరం జరగబోతోంది. అన్ని పార్టీలు తమ తమ అభ్యర్థుల ఎంపిక పైన కసరత్తు ప్రారంభించాయి. ప్రస్తుతం నడుస్తున్న ట్రెండు ప్రకారం తమ పార్టీ తరపున పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న వారికోసం చూస్తున్నాయి.

## వేట మొదలుపెట్టిన వైసీపీ..!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక ప్రత్యేకత ఉంది. సుదీర్ఘకాలంగా అంటే మూడు దశాబ్దాలపాటు కాంగ్రెస్‌పార్టీలో కొనసాగి, పార్టీ అధిష్టానంతో సంబంధంలేకుండా సొంత ఛరిష్మాతో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన ఘనత దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డిది. అయితే, ఆయన ఆకస్మిక మరణం తరువాత అదే కాంగ్రెస్‌పార్టీపై తిరుగుబాటుచేసి, జైలుపాలై 2014లో ఒకసారి ప్రజలచేత తిరస్కరించబడి, 2019లో రెండవసారి అశేష ప్రజాభిమానంతో విభజిత ఆంధ్ర సీఎంగా బాధ్యతలు చేపట్టిన చరిత్ర ఆయన వారసుడు జగన్‌మోహన్‌రెడ్డిది. ఆయన స్థాపించిన పార్టీలో రాజశేఖరరెడ్డి మార్కు ఉన్న నేతలకంటే కొత్త తరానికే ఆ పార్టీ నాయకత్వం ఎక్కువ ప్రాధాన్యత కల్పించింది. అస్సలు రాజకీయ అనుభవం లేని విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారి ఆశీస్సులతో టిక్కెట్లు, మంత్రి పదవులు పొందినవారే వైసీపీలో ఎక్కువమంది ఉన్నారు. నాన్న మరణానంతరం పది సంవత్సరాలు పూర్తిగా ప్రజాక్షేత్రంలోనే ఉండి, ప్రజలతో మమేకమైన జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి సామాన్య ప్రజలకి పూర్తిగా దూరమైపోయారన్న విమర్శ సొంతపార్టీ వర్గాలనుండే వ్యక్తమవుతోంది. తనని నమ్ముకున్న వారికీ, తమ పార్టీ నేతలకీ, తనకోసం తపించి శ్రమించిన వారికీ, ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా దూరంగా పెట్టారన్న అపవాదు కూడా జగన్‌పైన ఉంది. ఇదే సమయంలో ఆయన గత నాలుగున్నర సంవత్సరాల కాలంగా తాడేపల్లి క్యాంపు కార్యాలయానికే పరిమితం కావడంతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న ఆగడాలు, అరాచకాలు, అక్రమ సంపాదన వ్యవహారాలూ జగన్ దాకా చేరడంలేదన్నది కూడా ఒక కోణం. తీరా ఎన్నికల వేళ సమీపించే నాటికి ఒక్కొక్కరి భాగోతం బయటపడడంతో వైసీపీ కడుక్కునే పనిలో పడింది. ఈ క్రమంలోనే ఇప్పుడు 50 మందికిపైగా సిట్టింగులను పక్కన పెట్టడం లేదా పక్క నియోజకవర్గాలకి మార్చడం వంటి ప్రక్రియకి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే శాసనసభ్యులుగా ఉన్న చాలామందికి ఆ పార్టీ స్థానచలనం కలిగించబోతోంది. మొత్తం 150 మందిలో కొంతమందిని పక్క నియోజకవర్గాలకి మార్చి ఆటాడబోతోంది. మరికొన్ని స్థానాల్లో పాతవారిని పక్కనపెట్టి కొత్తవారికి అవకాశం కల్పించే పనిలో పార్టీ పెద్దలు తలమునకలైవున్నారు. ప్రతి జిల్లాలోనూ వైసీపీకి ఇలాంటి తలనొప్పులే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులలో కొత్తవారికి టిక్కెట్లు ఇవ్వాలంటే కత్తి మీద సామే. ప్రస్తుత రాజకీయాలలో కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం టిక్కెట్లు ఇవ్వాలంటే పైన పేర్కొన్న అర్హతలు, అనర్హతలు పరిగణలోకి తీసుకోవాలి, లేదంటే రాజకీయంగా రాణించడం కష్టమే. కాబట్టి పై నిబంధనల ప్రకారం పార్టీ అభ్యర్థులను ఎంపిక చేయాలి.

## టీడీపీ టిక్కెట్ల కోసం పెరుగుతున్న పోటీ!

ఇక తెలుగుదేశం పార్టీ కూడా ఆ పార్టీ ఆవిర్భావ సమయంలో చాలామంది కొత్త వారికి రాజకీయ భవిష్యత్తును ప్రసాదించింది. అయితే, ఆనాటి పార్టీ అధినేత క్రమశిక్షణకి పెద్దపీట వేయడంతో ఆ పార్టీలో ఉన్న రిప్ రాఫ్ అంతా క్రమేణా తెరమరుగై రాజకీయంగా అనుభవం, అవగాహన వున్న నేతలే అక్కడ మిగిలారు. రంగులేసుకునేవాడు రాజకీయమేం చేస్తాడు అని కామెంట్ చేసిన వారి ఊహలు తల్లక్రిందులయ్యేలా టీడీపీని ప్రజలకి దగ్గర చేశారు ఎన్టీఆర్. ఆ తరువాత రామారావు దగ్గర నుండి పార్టీని లాక్కున్న చంద్రబాబు పార్టీలో మిగిలివున్న అరాకొర చెత్తని కూడా ఏరిపారేసి తన సొంత టీంని పెట్టుకున్నారు. 2014 తరువాత సీన్ మారింది. అడ్డదారిలో రాజకీయ రంగప్రవేశం చేసిన చంద్రబాబు వారసుడు లోకేష్, ఏకంగా మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాడు. పార్టీలోనూ పాలనలోనూ తన మార్కు ఉండాలన్న ఆలోచనతో పార్టీని గాడి తప్పించాడు. పూర్తిగా రాజకీయ అనుభవం, అవగాహన లేని అపరిపక్వత నిర్ణయాలతో పార్టీని పడుకోబెట్టేశాడు లోకేష్. "పార్టీ లేదు... తొక్కా లేదు" అని తమ సొంత పార్టీ నాయకుడే కామెంట్ చేసే స్థాయికి పార్టీని దిగజార్చేశాడు. ఇప్పుడు 2024 సమీపించేనాటికి టీడీపీకి మరో అవకాశం లభించింది. జగన్ అధికారంలోకి వస్తే తెలుగుదేశం కనుమరుగైపోతుందనుకున్న వారి అంచనాలు తారుమారు చేస్తూ వైసీపీ నాయకులే టీడీపీకి ఊపిరిపోశారు. ప్రజలు 23 సీట్లకి పరిమితం చేసిన టీడీపీని వైసీపీ నేతలు జపిస్తూ తరచూ ఆ పార్టీని జనానికి గుర్తుచేస్తూ వచ్చారు. చివరికి చంద్రబాబు అరెస్టుతో ఐసీయూలో ఉన్న పార్టీని జనరల్ వార్డుకి తెచ్చేశారు. ఒక్కసారిగా ఆ పార్టీ మళ్ళీ వార్తలలోకి ఎక్కడంతో అక్కడ కూడా టిక్కెట్ల డిమాండ్ పెరిగింది. ఆ పార్టీ పెద్దలు కూడా వైసీపీ చూస్తున్న తరహా నేతల కోసమే భూతద్దం పెట్టి వెతుకుతున్నారు. వెయ్యికోట్ల అవినీతి చేసినవాడికి అవతల పార్టీ టిక్కెట్టు ఇస్తే, రెండువేల కోట్లు మింగినవాడికి తమ పార్టీ టిక్కెట్టు ఇవ్వాలని చూస్తున్నారు. బూతులలో డిగ్రీ తీసుకున్న వారిని అవతల పార్టీ బరిలో దించితే, అదే బూతులతో మాస్టర్స్ చేసిన వారిని తమ పార్టీ తరపున యుద్ధానికి సిద్ధం చేయాలనుకుంటున్నారు.

## తన సేనతో.. సిద్ధంగా ఉన్న జనసేన!

పవన్ కళ్యాణ్ అంటేనే మాస్. కాబట్టి, ఆయన పార్టీ తరపున పోటీ చేయడానికి పైన పేర్కొన్న అర్హతలు ఉన్న అభ్యర్థులను వెతుక్కోవలసిన అవసరం ఆయనకి లేదు. అసలు ఆయనకే పూర్తిగా రాజకీయ అవగాహన, స్థిరత్వం రెండూ లేవు. జనసేన పార్టీ తరపున పోటీ చేయడానికి పైనపేర్కొన్న అర్హతలు ఉన్న అభ్యర్థులే ఆసక్తి చూపిస్తారు తప్ప మంచివారు ఎవరూ ముందుకి రాకపోవచ్చు.

## ప్రేక్షక పాత్ర పోషిస్తున్న బీజేపీ!

ఆంధ్రాలో అన్ని పార్టీలలో రాజకీయ హడావుడి మొదలైనా, కమలం పార్టీ మాత్రం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. మిగిలిన పార్టీల సీట్ల సర్దుబాట్లు, ఇతర పార్టీల గోడ దూకుళ్లు అన్నీ పూర్తయ్యాక మిగిలిన సరుకుని బట్టి నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఆ పార్టీ ఉన్నట్లు కనపడుతోంది.

మొత్తంమీద 2024 ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాజకీయ స్వరూపాన్ని కొత్త మలుపు తిప్పబోతున్నాయన్నది మాత్రం స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ చూడనంతటి డబ్బు ఈసారి రాష్ట్రంలో పంపకానికి సిద్ధంగా ఉందన్నది అర్థమైపోతోంది. ఇప్పటివరకూ కనీవినీ ఎరుగని రీతిలో దాడులూ, ప్రతిదాడులూ ఉండబోతున్నాయన్న అభిప్రాయం విశ్లేషకుల నుండి వ్యక్తమవుతోంది. రాబోయే నూతన సంవత్సరంలో అల్ ది బెస్ట్ టు ఆంధ్రప్రదేశ్...!

# ఘనంగా వీరబాలల దినోత్సవం

నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో ఈనెల 26న మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వీరబాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డా. గిరి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.




ఆత్మీయ శుభాకాంక్షలు

యంగ్ డైనమిక్ లీడర్
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి
ఆత్మీయ శుభాకాంక్షలు.

మా రేవంత్
ప్రజల ముఖ్యమంత్రిగా అందరి హృదయాల్లో
మంచి స్థానం సంపాదించి,
మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని
మనసారా ఆశీర్వదిస్తూ...

పోలంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి
హోటల్ నిర్మల దక్షిణ్ - చెన్నై.





మంగళగిరిలోని పోలీసు కార్యాలయంలో డిసెంబర్ 27న డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# వివేకా సేవలను మరచిపోలేం

## కొనియాడిన నాయకులు



దివంగత నాయకుడు ఆనం వివేకానందరెడ్డి చిరస్మరణీయ నాయకులని, నెల్లూరు మునిసిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ఆయన చేసిన అభివృద్ధిని ఏనాటికీ మరువలేమని నాయకులు కొనియాడారు. ఈనెల 23న ఆనం వివేకా 73వ జయంతి ఏసీనగర్‌లోని ఆనం ఘాట్‌లో జరిగింది. ఆనం అభిమానులు, కుటుంబసభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆనం సోదరులు.. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, ఆనం జయ కుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం వివేకా తనయుడు ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొని ఆనం వివేకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# 2024కు.. స్వాగతం!



స్వాగతం..
సుస్వాగతం!
కొత్త సంవత్సరానికి
శుభస్వాగతం!
ప్రజలందరూ
సుఖశాంతులతో వర్ధిల్లాలని
మానవాళి మనుగడలో
మానవత్వం వెల్లివిరియాలని,
మమతల పూదోటలతో
అందరి జీవితాలు పల్లవించాలని
స్వార్థం-ద్వేషం సమసిపోవాలని
క్రూరత్వాలు, జాతి మత కులభేదాలు
కూకటివేళ్ళతో సహా కూలిపోవాలని
నీతి-నిజాయితీ, న్యాయం - ధర్మం
నేల నాలుగుచెరగులా విస్తరించాలని
సమానత్వం-సర్వమత సౌభ్రాతృత్వంతో
ప్రపంచమంతా కళకళలాడాలని
విశ్వశాంతి వసుధ నిండా నిండాలని
మానవుడు మహనీయుడుగా వెలుగొందాలని
మనసారా కోరుకుంటూ..
జగతికంతా పండుగలా రావాలని
ఆహ్వానిస్తున్నా నూతన వత్సరాన్ని...
అందుకోవమ్మా..
ఓ కొత్త సంవత్సరమా!
ఈ సంతోషపు
సాదర స్వాగత గీతాన్ని!



- షేక్ కాలేషా సాహెబ్
ఫోన్: 7680876531

# తక్కువ ఖర్చుతో ఉత్తమ కార్గో సేవలు

## శ్రీసిటీ-సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమలో అధునాతన 'డ్రై పోర్ట్'



తక్కువ ఖర్చుతో సుస్థిరమైన కార్గో సేవలను శ్రీసిటీ-సిద్ధార్థ లాజిస్టిక్ పరిశ్రమ ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. శ్రీసిటీ జంక్షన్‌గా చెన్నై-తిరుపతి-నెల్లూరును కలుపుతూ ట్రై-సిటీ పారిశ్రామిక కారిడార్‌కు కూడా వేగంగా అడుగులు పడుతున్నాయి. దీంతో కార్గో సేవలకు డిమాండ్ ఎక్కువవుతోంది. శ్రీసిటీ ద్వారా మాత్రమే అంతర్జాతీయ కార్గో ట్రాఫిక్ ఏడాదికి సుమారు 1,20,000 కంటైనర్లకు చేరుకుంది. ఈ పరిస్థితుల్లో శ్రీసిటీలో ఏర్పాటు చేసిన 'డ్రై పోర్ట్'గా పిలువబడే ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది సమగ్ర లాజిస్టిక్స్ సెంటర్‌గా పనిచేస్తుంది. ఈ డ్రై పోర్ట్ 150 కంపెనీలకుపైగా సేవలందిస్తోంది, ఏటా 7,500 కంటైనర్లు, 5,000 విమాన రవాణాలను నిర్వహిస్తోంది. సిద్ధార్థ లాజిస్టిక్స్ విశేష పనితీరుతో 2020-2021 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి రూ.16,000 కోట్ల కస్టమ్స్ సుంకం లభించిందని, శ్రీసిటీలోని అన్ని కంపెనీలు తమ దిగుమతి, ఎగుమతి కార్యకలాపాలను సిద్ధార్థ లాజిస్టిక్స్ డ్రై పోర్ట్ ద్వారా జరిపితే, శ్రీసిటీ నుంచి ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్‌డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు.

# 'మంచికంటి'కి రంగనాథస్వామి సేవాభాగ్యం

## ఆలయ పాలకమండలి ఛైర్మెన్‌గా పదవీ స్వీకారం



నెల్లూరు శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి ఇటీవల కొత్త కమిటీ ఎంపికైంది. సౌమ్యుడు, వ్యాపారవేత్త, ధార్మికసేవా పరాయణుడు మంచికంటి శ్రీనివాసులు ఆలయ పాలకమండలి ఛైర్మెన్‌గా నియమితులు కావడం పట్ల భక్తుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వాసవి కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఆయన అందరికీ సుపరిచితులే. నెల్లూరుజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ ప్రధాన కార్యదర్శిగా, స్టోన్‌హౌస్‌పేటలో వెలసివున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ధర్మకర్తల మండలి ప్రధాన కార్యదర్శిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. దైవభక్తి కలిగి, ఆధ్యాత్మిక విషయాలపై మంచి అవగాహన ఉన్న మంచికంటి శ్రీనివాసులుకు రంగనాథుని సేవాభాగ్యం కలగడం విశేషం. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో మంచికంటితోపాటు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమితులైన పిన్నపరెడ్డి రాజేంద్ర, వేలూరు శ్రీనివాసులు, బల్లవోలు రమణయ్య, ఎస్.గోపి, వై.మాధవి, అడపాల లక్ష్మి, ప్రియాంక, వి.పద్మజ ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ఉప ప్రధానఅర్చకుడు ఇ.దొరస్వామి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు.

# భగవద్గీత కంఠస్థ పోటీలు



గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని వాగ్ధ స్కూల్‌లో ఇటీవల జిల్లాస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి వయోజనుల వరకు 5 విభాగాలు చేసి నిర్వహించిన ఈ పోటీలను గురూజీ షేక్ నజీర్‌బాషా, మెంటా రామ్మోహన్‌రావు, బయ్యా శ్రీనివాసులు శ్రీకృష్ణుని విగ్రహం వద్ద జ్యోతిని వెలిగించి పూజలు చేసి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 200మందిపైగా విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురూజీ షేక్ నజీర్ భాష మాట్లాడుతూ, ప్రతిఒక్కరికీ శ్రీకృష్ణుని బోధనలు ఆచరణీయమన్నారు. బయ్యా శ్రీనివాసులు మాట్లాడుతూ, భగవద్గీత విశిష్టతను వివరించారు. గత 30 సంవత్సరాలుగా భగవద్గీత పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవ సందర్భంగా నెల్లూరు నగరంలో ఒకే వేదికపై లక్ష భగవద్గీత పారాయణం నిర్వహించేందుకు కృషిచేస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు మిద్దె శ్రీనివాసరావు, మెంటా రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యడవల్లి సురేష్, బీజేపీ నాయకుడు మిడతల రమేష్, జి.నరసింహారావు, ఏవీ రాజేంద్రప్రసాద్, దాసరి రాజేంద్రప్రసాద్, బి పోతనరెడ్డి, శివకుమార్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# టూకీగా...



## సోమశిలలో 35 టీఎంసీల నీళ్ళు

ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం వస్తుండడంతో సోమశిల జలాశయంలో ఈనెల 25వ తేదీ నాటికి 35.825 టీఎంసీల నీరు నిల్వవుంది. దీంతో దిగువ డెల్టాకు 2,800, ఉత్తర కాలువలకు 250, దక్షిణ కాలువలకు 20 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.

## ఆత్మకూరులో ఘనంగా గంధ మహోత్సవం

ఆత్మకూరులోని శ్రీ హజరత్ ఖాదర్ ఔలియా దర్గాలో ఈనెల 25న గంధమహోత్సవం వైభవంగా జరిగింది. దర్గా కమిటీ నిర్వాహకులు రసూల్, ముజీబ్, నజీబ్, సమీ, ఖలీల్, ప్రముఖులు మహమ్మద్ మఖ్దూం నవాజ్, ఇమ్రాన్, దస్తగిరి ఆధ్వర్యంలో గంధాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి మజార్లకు ఎంతో భక్తిశ్రద్ధలతో గంధలేపనం గావించారు.

## జంగాలపల్లిలో గొంతువాపుతో పశువులు మృతి

దుత్తలూరు మండలం జంగాలపల్లిలో గొంతువాపు వ్యాధికి పశువులు మృతిచెందుతున్నాయని, గత వారం రోజుల్లోనే 25 పశువులు మరణించాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పశువైద్యశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి, వెంటనే పశువైద్యశిబిరం నిర్వహించి మూగజీవాలను కాపాడాలని వారు కోరుతున్నారు.

## వెంకటాచలంలో క్రిస్మస్‌రోజున అన్నదానం

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని డిసెంబరు 25న వెంకటాచలంలోని సెయింట్ జ్యూడ్స్ మానసిక వికలాంగుల కేంద్రంలోని చిన్నారులకు టీడీపీ నాయకుడు గుమ్మడి రాజా యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు పార్థసారథినాయుడు, సత్తార్‌సాహెబ్, అమర్‌నాథ్, హరికృష్ణ, శ్రీహరి, శ్రీనివాసులు, రమేష్, విజయకుమార్, శేఖర్, నితిన్, మహేష్ పర్యవేక్షించారు.

## మేకపాడు రైతుభరోసా కేంద్రం తనిఖీ

కందుకూరు మండలం జి.మేకపాడు గ్రామంలో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని ఇటీవల మండల వ్యవసాయాధికారి రాము తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈ రబీ సీజన్‌లో సాగవుతున్న వరి, కంది, మిరప, పొగాకు పంటలకు ఈ-క్రాప్ నమోదుచేయాలన్నారు. గ్రామంలోని పలు పంటలను కూడా పరిశీలించి సాగు అభివృద్ధికి రైతులకు సలహాలనిచ్చారు.

## కలువాయిలో ఏడీపీఎస్ వార్షికోత్సవం

అంబేద్కర్ ధర్మపోరాట సమితి(ఏడీపీఎస్) 28వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 25న కలువాయిలో ఘనంగా జరిగాయి. సమితి జిల్లా అధ్యక్షుడు నిజమాల ప్రసాద్ పాల్గొని సమితి లక్ష్యాలను వివరించారు. జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ జివి మురళీకృష్ణ, నరసింహులు, సురేష్, నాగేశ్వరరావు, రేపూరు శ్రీనివాసులు, రమణయ్య, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజ్జంపల్లి విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ఉదయగిరి మండలం బిజ్జంపల్లి జడ్పీ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు తన వంతు సహకారంగా పూర్వ ఉపాధ్యాయురాలు కె.వాణి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా, విద్యార్థులకు సాయంత్రం వేళలో తాము అల్పాహారం అందజేస్తామని ఉపాధ్యాయులు ఫణిరాజు, సుబ్బారెడ్డిలు తెలిపారు.

## అలగానిపాడులో 'ఫ్యామిలీ డాక్టర్'

విడవలూరు మండలం అలగానిపాడు గ్రామంలో ఈనెల 23న ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ హరికృష్ణ 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులిచ్చారు. ఈ చలికాలంలో జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఏఎన్ఎం సుబ్బమ్మ, ఆరోగ్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిట్రగుంట చర్చిలో వార్షికోత్సవ వేడుకలు

బోగోలు మండలం బిట్రగుంటలోని బేతనీయపేటలో ఉన్న 'ది సెంట్రల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి' 24వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 23న ఘనంగా జరిగాయి. సంఘ కాపరి ఏఎన్ జోసెఫ్ వాక్యోపదేశం చేశారు. అనంతరం పేదలకు అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు.





# అడుగడుగునా జన నీరాజనం

- ఎమ్మెల్యే ప్రసన్న సారధ్యంలో..దిగ్విజయంగా సామాజిక సాధికార యాత్ర
- వేలసంఖ్యలో తరలివచ్చిన ప్రజలు..జనసంద్రంగా మారిన నార్త్ రాజుపాళెం

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సారధ్యంలో ఈనెల 26న కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర దిగ్విజయమైంది. అడుగడుగునా జనం ఈ యాత్రకు నీరాజనాలు పలికారు. ఎమ్మెల్యే ప్రసన్న ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు వేల సంఖ్యలో నార్త్‌మోపూరుకు వచ్చి యాత్రను జయప్రదం చేశారు. పెద్దసంఖ్యలో కార్లు, బస్సులు, వాహనాల్లో ప్రజలు తరలి వచ్చారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ప్రజలు, బడుగు బలహీనవర్గాల వారు తండోప తండాలుగా తరలివచ్చారు. నార్త్ రాజుపాళెం గ్రామం జనసంద్రమైంది. దీంతో వైకాపా నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం ఇనుమడించింది. డెప్యూటీ సీఎం రాజన్నదొర, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ప్రముఖ సినీనటుడు అలీ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి పోతుల సునీత, డీసీఎమ్మెస్ ఛైర్మెన్ వీరి చలపతి రావు, ఏపీఎల్డీఏ ఛైర్మెన్ జి.విజయ కుమార్, డిఏఏబి ఛైర్మెన్ నిరంజన్‌బాబు రెడ్డి, ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, ఏఎంసి ఛైర్మెన్ రాధాకృష్ణారెడ్డి, నెల్లూరు మేయర్ స్రవంతి, డెప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, యువజన విభాగం నాయకుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. టపాతోపు వద్ద నుంచి నార్త్‌రాజు పాళెం వరకు జరిగిన పాదయాత్రలో కేరళ సంగీతం, అశ్వప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నార్త్‌రాజు పాళెంలో దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని విజయ సాయిరెడ్డి ఆవిష్కరించారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను రిమోట్ ద్వారా ప్రారంభించారు.

## జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి :

నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాష్ట్రం సమగ్రాభివృద్ధిని సాధిస్తోందని చెప్పారు. ప్రజలు వైకాపాను, వైఎస్ జగన్‌ను ఎంతగానో ఆదరిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ, రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల వారికి, అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి వేలకోట్ల రూపాయలను కేటాయిస్తూ, సిఎం జగన్ చేస్తున్న కృషి అపారమని కొనియాడారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రీ అందించనన్ని సంక్షేమ పథకాలను ప్రజలకందించిన ఘనత ఒక్క జగన్‌దేనన్నారు. ప్రత్యేకించి కోవూరు అభివృద్ధికి కోట్లాది రూపాయలను కేటాయిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ జగన్‌ను సిఎంగా అఖండ విజయం చేకూర్చాలని ఆయన పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు.

## జనవరి 20న మహారుద్రాభిషేకం - ప్రసన్న

జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ జనవరి 20న కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెంలోని శ్రీ నారికేళ సహిత రసలింగేశ్వర (పాదరసం) మహారుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. ఆరోజున స్వామివారికి లక్ష కొబ్బరికాయలు, లక్ష రుద్రాక్షలు–లక్ష బిల్వార్చనలు, లక్ష కుంకుమార్చనలను 40 మంది వేదపండితులతో నిర్వహిస్తామని చెప్పారు. పేదలకు అండగా ఉంటున్న వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని, ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఎంతో విశిష్టమైనరీతిలో యాగాలు నిర్వహించనున్నామని తెలిపారు.



భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ జయంతిని పురస్కరించుకుని డిసెంబర్ 25వ తేదీన ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు.


In Loving Memory of
Shri. Davuluru Madhusudhana Rao
Rtd. MPDO



15 June, 1937 – 13 December, 2022
25-9-336, Z.P.COLONY NELLORE-524004

Shri Madhusudhana Rao was not just a beloved Grand father; he was the cornerstone of our family, a guiding light whose nurturing presence touched the lives of generations. His love and care extended far beyond the immediate family. He was known for his commitment to maintain social harmony. He spread his positivity not just within the family but also to the plants he cared for so dearly. We are blessed to have experienced a fraction of his lifestyle and remember the profound influence he had on us forever.

Grand Children
Davuluru Salini Priyamvada - USA
Davuluru Nandadeep - USA







Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com